

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయానికి కూటమి పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 08.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 168 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఇక రాష్ట్రంలోనే విదేశీ విద్య !





## విదేశీ వర్సిటీలకు ఏపీలో క్యాంపస్‌ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ | రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు | ఉన్నత విద్య, వైద్యం, సంక్షేమానికి కేబినెట్ పెద్దపీట

**అమరావతి, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో బుధవారం దాదాపు మూడు గంటలపాటు జరిగిన కేబినెట్ సమావేశంలో 12 అజెండా అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఉన్నత విద్య, వైద్యం, గిరిజన సంక్షేమం, ఉద్యాన రంగం, భూకేటాయింపులు తదితర అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. ఇప్పటికే జారీ చేసిన పలు ఉత్తర్వులకు రాటిఫికేషన్ ఇచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన నాయకత్వాన్ని చంద్రబాబు ప్రశంసించారు. మోదీని 'రైట్ టైమ్–రైట్ ప్లేస్–రైట్ లీడర్'గా అభివర్ణించారు. ప్రధాని నిరంతరం వివిధ అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారని నారా లోకేశ్ తెలిపారు. ప్రధానిగా ఉన్నప్పటికీ అందరి అభిప్రాయాలను మోదీ స్వీకరిస్తారని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మాట విని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రులకు సూచించారు.

**ఉన్నత విద్యా పాలసీకి ఆమోదం :** విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు వీలు కల్పించేలా 2026 ఉన్నత విద్యా పాలసీ, విద్యా చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యానికి మార్గం సుగమం చేసే విధంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యాన రంగాన్ని డిజిటల్ వ్యవస్థతో అనుసంధానించే ఏపీహెచ్ఎంఎస్ ప్రాజెక్టుకు కూడా కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. క్యూసీబీఎస్ విధానంలో ఎంపికైన వాసర్ ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్‌కు రూ. 20.62 కోట్లతో ప్రాజెక్టును అప్పగించనున్నారు. ఇందులో రూ. 11.77 కోట్లు అభివృద్ధి వ్యయానికి, రూ. 8.85 కోట్లు ఐదేళ్ల నిర్వహణ, సేవలకు కేటాయించారు. మొత్తం 72 నెలలపాటు ప్రాజెక్టు అమలు కానుంది.

**ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ :** ఆశా కార్యకర్తలకు సామాజిక భద్రత కల్పించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సేవలో ఉండగానే మరణించే అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు సంవత్సరానికి రూ. 5 వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లించేందుకు కేబినెట్ అంగీకరించింది.



2 లో





## మత్తు మహమ్మారికి ముకుతాడు

- డ్రగ్స్ నివారణపై రాష్ట్రవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలు
- గంజాయి రవాణాపై సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా
- యువతను చైతన్యపరిచేందుకు మంత్రుల క్షేత్రస్థాయి పర్యటనలు
- మాదకద్రవ్యాల నివారణపై మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నివారణపై హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన మంత్రుల బృందం ఉండవల్లిలో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... డ్రగ్స్ పై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ దుష్ఫలితాలపై ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులను చైతన్యవంతం చేసేందుకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ వంటి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. డ్రగ్స్ వద్దు బ్రో వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి యువతను చైతన్యం చేయాలని అన్నారు. డ్రగ్స్, గంజాయి చాక్లెట్ల వంటి వాటి రవాణాను నిరోధించేందుకు రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యాన చేపట్టే క్లస్టర్ సమావేశాల్లో ఈగల్ యంత్రాంగాన్ని భాగస్వాములను చేసి, డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలకు రూపకల్పన చేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు.

మిగతా 2లో...

## వేగమే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత

పెట్టుబడులకు, పరిశ్రమలకు రాష్ట్రం స్వర్గధామంగా మారుతోంది: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**విశాఖపట్నం, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్ని అవరోధాలు ఎదురైనా భారత్ 7.8 శాతం వృద్ధిరేటుతో ముందుకు సాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖపట్నం ఐఐఎంలో జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంతో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ ప్రయాణంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

పెట్టుబడులకు 'టైమే ఇన్వెస్ట్‌మెంట్' అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఏపీఐఐసీ సింగిల్ విండో విధానం ద్వారా 6 నుంచి 12 నెలల్లో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం గేట్‌వే ఆఫ్ ఎకానమీగా ఎదుగుతోందని, సీఎం చంద్రబాబు ప్రతిపాదించిన విశాఖ ఎకనామిక్ రీజియన్ ఆలోచన ఎంతో కీలకమన్నారు.

మిగతా 2లో...

## ఓటర్ల జాబితాపై స్పెషల్ డ్రైవ్



- తొలగించిన 46.62 లక్షల ఓటర్లపై ఇంటింటి పరిశీలన
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్

2 లో

## లిటిగేషన్‌పై ప్రభుత్వ 'పాలసీ' అస్త్రం

- త్వరలో పాలసీ ముసాయిదా రూపకల్పన
- న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

2 లో

## ఏపీ టూరిజానికి ఏఐ టచ్!



- 'నివు ఏఐ'తో 100కు పైగా పర్యాటక ప్రాంతాల్లో స్మార్ట్ సేవలు
- స్పెయిన్‌లోని 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్'లో మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి/స్పెయిన్, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతికతను ప్రవేశపెట్టి చారిత్రాత్మక అడుగు వేశామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్పెయిన్‌లోని సెవిల్లెలో జరుగుతున్నం 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్–2026'లో ఎక్స్‌ప్లర్జర్ సంస్థ రూపొందించిన 'నివు ఏఐ' ప్లాట్‌ఫారమ్‌ను ఆవిష్కరించారు. ఏపీ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని అత్యాధునిక సాంకేతికతతో ప్రపంచ పర్యాటకులకు చేరువ చేస్తున్నామని చెప్పారు.

మిగతా 2లో...

## ఏపీకి పెట్టుబడుల జోరు!




- రెండేళ్లలో రూ.22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులు
- 9.3 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రణాళిక
- రూ.5 లక్షల కోట్లతో 257 ప్రాజెక్టులు ఇప్పటికే క్షేత్రస్థాయికి
- వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్

**విశాఖపట్నం, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్థిక అభివృద్ధి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. ఐఐఎం విశాఖపట్నంలో జరిగిన 31వ ప్రాంతీయ పెట్టుబడుల సదస్సులో ఆయన మాట్లాడుతూ 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ. 22.6 లక్షల కోట్ల విలువైన, 9.3 లక్షల ఉద్యోగాలు కల్పించగల 714 ప్రాజెక్టుల ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

మిగతా 3లో...

## కారుణ్య నియామకాల్లో జెట్ స్పీడ్

- ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర.. నాలుగు నెలల్లోనే ఉత్తర్వులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక 627 కుటుంబాలకు అండ
- విద్యుత్ శాఖలో 629 ఏఈ పోస్టుల భర్తీకి చర్యలు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



## గోదావరి డెల్టా ఆధునీకరణకు సమగ్ర ప్రణాళిక



- లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్ రూపకల్పన
- పూడిక తొలగింపు.. లాకులు, షట్టర్ల ఆధునీకరణకు ప్రాధాన్యం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** గోదావరి డెల్టాలో శాశ్వత ముంపు సమస్యకు పరిష్కారం చూపే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇందుకోసం రూ. 13.4 కోట్ల వ్యయంతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

మిగతా 2లో...

## రూ.లక్ష కోట్లకుపైగా ప్రాజెక్టులు

- రోడ్లు, పోర్టులు, రైల్వేల అనుసంధానంతో మల్టీ-మోడల్ కనెక్టివిటీ
- 22 ట్రక్ టెర్మినల్స్.. 300 కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు
- పెట్టుబడిదారులకు పూర్తి మౌలిక వసతులతో ఏపీ సిద్ధం
- రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

మిగతా 3లో...

## స్థానిక ఎన్నికలపై 'కేవియట్'

- వైసీపీ పిటిషన్‌పై తమ వాదనలు కూడా వినాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి

**ఢిల్లీ, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను సవాల్ చేస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఎలాంటి ఆదేశాలు జారీ చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వ వాదనలను

మిగతా 2లో...

# వేగమే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత




(మొదటి పేజీ తరువాయి)

రాబోయే 25 ఏళ్ల అభివృద్ధిని ముందుగానే అంచనా వేసి రాష్ట్రాన్ని సీఎం ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లో, నిర్ణీత గడువుకు ఆరు నెలల ముందే పూర్తవడం రాష్ట్రంలో ప్రాజెక్టుల అమలులో వేగానికి నిదర్శనమని మంత్రి అన్నారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని, పోలవరం రాష్ట్రానికి జీవనాడిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రైల్వే జోన్, బుల్లెట్ ట్రైన్ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని తెలిపారు.

ఏపీలో సుమారు 45 రోజులకు ఒక విమానాశ్రయాన్ని ప్రారంభించే స్థాయిలో విమానయాన రంగం విస్తరిస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయాలు కేవలం కనెక్టివిటీకి పరిమితం కాకుండా ఆయా ప్రాంతాలను మినీ ఎకనామిక్ సిటీలుగా మారుస్తున్నాయని చెప్పారు. కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు సైట్ క్లియరెన్స్ లభించిందని, 5 వేల మంది ఏవియేషన్ ప్రొఫెషనల్స్‌ను తయారు చేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు.

గత రెండేళ్లలో 216 మెగా ప్రాజెక్టుల ద్వారా ఏపీకి రూ. 8.67 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని కేంద్ర మంత్రి తెలిపారు. 2023--24లో 92 మిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2025-26లో 608 మిలియన్ డాలర్లకు పెరిగాయని చెప్పారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్--నిప్పాన్ స్టీల్, ఎన్‌టీపీసీ, టాటా పవర్, రిలయన్స్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులకు ముందుకు రావడం రాష్ట్రంపై పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

కర్నూలులో దేశంలో తొలి డ్రోన్ సిటీ రూపుదిద్దుకుంటోందని, పుట్టపర్తిలో ఏరోస్పేస్, డిఫెన్స్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు. కర్నూలులో రాష్ట్ర తొలి ఎఫ్‌టీఓ ప్రారంభించామని, మరో ఐదు ఎఫ్‌టీఓలు పైప్‌లైన్‌లో ఉన్నాయని, కుప్పంలో హంస ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రం ఏర్పాటవుతోందని చెప్పారు. 'ఈ దశాబ్దం భారతదేశానిది. వేగాన్ని ఎంచుకోండి.. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోండి' అంటూ ప్రపంచ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 31 ఎంవోయూల మార్పిడి జరగగా, మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు, సీఐఐ, ఐఐఎం ప్రతినిధులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై స్పెషల్ డ్రైవ్



**అమరావతి, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా పునఃపరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఎస్ఐఆర్-2026లో భాగంగా తొలగించిన 46,62,583 మంది ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు చెప్పారు. గురువారం నుంచి బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి తొలగించిన ఓటర్ల పరిస్థితిని నిర్ధారిస్తారని వెల్లడించారు.

మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించినట్లు వివేక్ యాదవ్ తెలిపారు. ఎస్ఐఆర్ గణనలో 44,89,512 మంది ఓటర్లు అందుబాటులో లేరని గుర్తించామని చెప్పారు. అనంతరం నోటీసుల ప్రక్రియలో మరో 1,73,071 మంది అనర్హులుగా తేలడంతో మొత్తం 46,62,583 మంది పేర్లను తొలగించినట్లు వివరించారు. జూలై 31న 3,71,38,182 మంది ఓటర్లతో ముసాయిదా జాబితాను ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

పరిశీలనలో అర్హత ఉన్నప్పటికీ పొరపాటున ఓటరు పేరు తొలగించినట్లు తేలితే ఫారం-6 ద్వారా తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందని సీఈవో తెలిపారు. బీఎల్ఓల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం నిరంతర సవరణ ప్రక్రియలో అర్హులైన వారి పేర్లను జాబితాలో చేర్చుతామని చెప్పారు. కొత్తగా ఓటు హక్కుపొందిన అర్హులు కూడా ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అదే సమయంలో అర్హత లేని నమోదులు జాబితాలో కొనసాగకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వివేక్ యాదవ్ తెలిపారు. అక్టోబర్ 16న రాష్ట్రంలో ఎస్ఐఆర్-2026 తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తుది జాబితా అనంతరం కూడా నిరంతర సవరణ ప్రక్రియ కొనసాగుతుందని, అర్హత తేదీలుగా జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1లను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. తదుపరి వార్షిక సంక్షిప్త సవరణకు జనవరి 1ను అర్హత తేదీగా తీసుకుంటామని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని సీఈవో పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికలపై 'కేవియట్'

(మొదటి పేజీ తరువాయి)

కూడా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరింది.

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతున్న తీరును సవాల్ చేస్తూ వైసీపీ పిటిషన్ దాఖలు చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తికాకముందే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి జనవరిలో ఉన్న డేటానే ప్రాతిపదికగా తీసుకుంటోందని వైసీపీ తన పిటిషన్‌లో పేర్కొంది.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏపీ హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై అక్టోబర్ 1న తీర్పు వెలువడింది. వార్డుల విభజన ప్రక్రియ చేపట్టడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వానికి అవకాశం ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

ఈ పిటిషన్ సోమవారం దాఖలైన అనంతరం వైసీపీ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఎదుట మెన్షన్ చేశారు. రాష్ట్రంలో ఏ సమయంలోనైనా స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. అంశాన్ని పూర్తిగా పరిశీలిస్తామని తెలిపారు.

మరోవైపు 'సర్' ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని వైసీపీ తరఫు న్యాయవాది కోరారు. వార్డుల సరిహద్దుల 'ఫ్రీజింగ్' అంశాన్ని ప్రస్తావించిన సమయంలో ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. మున్సిపాలిటీల సరిహద్దుల ఫ్రీజింగ్ నిబంధన వార్డులకు వర్తించదని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ పేర్కొన్నారు.

# ఇక రాష్ట్రంలోనే విదేశీ విద్య !

(మొదటి పేజీ తరువాయి)



ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ప్రయోజనం కల్పించనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయించేందుకు అనుమతించారు.

బాపట్ల జిల్లా రేపల్లెలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం లభించింది. రూ. 58.42 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు అదనంగా 66 పోస్టులను మంజూరు చేయడానికి కూడా కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

**ఉద్యాన రంగానికి డిజిటల్ వ్యవస్థ :** ఉద్యాన రంగాన్ని డిజిటల్ పరిజ్ఞానంతో అనుసంధానించే ఏపీహెచ్ఎంఎస్ వ్యవస్థ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. క్యూసీబీఎస్ విధానంలో ఎంపికైన వాసర్ ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్‌కు రూ. 20.62 కోట్లతో ప్రాజెక్టును అప్పగించనున్నారు. ఇందులో రూ. 11.77 కోట్లు అభివృద్ధి పనులకు, రూ. 8.85 కోట్లు ఐదేళ్ల నిర్వహణ, సేవలకు కేటాయించారు. మొత్తం 72 నెలలపాటు ప్రాజెక్టు అమలు కానుంది.

**గిరిజన విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ :** గిరిజన విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణను బలోపేతం చేసేందుకు విశాఖపట్నం మరికవలసలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఐఐటీ-జేఈఈ, నీట్ పరీక్షలకు గిరిజన విద్యార్థులకు ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ అందించేలా ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ రాటిఫికేషన్ ఇచ్చింది.

తల్లికి వందనం పథకం 2026-27 మార్గదర్శకాలు, పరిపాలనా అనుమతులకు సంబంధించిన ఉత్తర్వులకు కూడా ఆమోదం తెలిపింది.

సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో డైట్ ఛార్జీల పెంపునకు సంబంధించిన ఉత్తర్వులను రాటిఫై చేసింది.

**కుప్పం అభివృద్ధికి భూ కేటాయింపు :** కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం నక్కనపల్లెలో 1.69 ఎకరాల గ్రేజింగ్ గ్రౌండ్ పోరంబోకు భూమి వర్గీకరణను మార్చి అథారిటీకి అప్పగించనున్నారు. ఈ స్థలంలో అధికారుల అతిథి గృహాన్ని నిర్మించనున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ పోరంబోకు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించిన రెవెన్యూ శాఖ ఉత్తర్వులకు కూడా రాటిఫికేషన్ ఇచ్చింది. అసలు అసైనీలు, వారి చట్టపరమైన వారసులు, మూడో వ్యక్తుల కొనుగోలుదారులు, ఇతర ఆక్రమణదారుల భూముల వర్గీకరణ మార్పు, క్రమబద్ధీకరణకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

**విద్యార్థుల వసతికి భూమి :** వైఎస్సార్ కడప జిల్లా నందలూరు మండలం పాతూరులోని శ్రీ కన్నేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం 7.66 ఎకరాల ప్రభుత్వ భూమిని దేవాదాయ శాఖకు బదలాయించేందుకు కేబినెట్ అంగీకరించింది. ఈ భూమి విలువ రూ. 60.20 లక్షలుగా అంచనా వేశారు. ఉడా ఎన్‌వోసీ, ఇతర నిబంధనలకు అనుగుణంగా భూమి బదలాయింపు చేపట్టనున్నారు.

ప్రకాశం జిల్లా కొండపి మండలం కేజీకే కండ్రికలోని ఏడు ఎకరాల వాగు పోరంబోకు భూమి వర్గీకరణను మార్చేందుకు కూడా ఆమోదం లభించింది. ఈ భూమిని ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ ఏర్పాటుకు వినియోగించనున్నారు.

**జగనన్న కాలనీలపై సబ్‌కమిటీ :** జగనన్న కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లపై కొత్త కేటాయింపులు, లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కల్పించే అంశాలను పరిశీలించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న వారికి ప్లాట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తమకు కేటాయించిన ప్లాటు అవసరం లేదని భావించే లబ్ధిదారులకు ఇతర ప్రాంతాల్లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు.

**మంత్రులకు సీఎం సూచనలు :** కర్మయోగి కార్యక్రమంలో భాగంగా మంత్రులు తమ శాఖల సిబ్బందికి శిక్షణ అందించాలని చంద్రబాబు సూచించారు. కేబినెట్ నిర్ణయాలను కలెక్టర్లకు వివరించి, వాటి అమలుపై క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, సూచనలను మంత్రులు శ్రద్ధగా విని పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

స్వయం ఉపాధి సంఘాల వద్ద ఉన్న సుమారు రూ. 30 వేల కోట్ల కార్పస్ నిధులను ప్రస్తావించిన సీఎం, మిగిలిన గ్రూపులను కూడా అదే స్థాయికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కుప్పంలో ఇజ్రాయెల్ సాంకేతికతతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న తన ఆలోచనను ప్రస్తావిస్తూ, ఇదే సాంకేతికతను గుజరాత్‌లో మోదీ విజయవంతంగా అమలు చేయించారని పేర్కొన్నారు.

**మోదీకి కేబినెట్ అభినందన :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మంత్రి నారా లోకేశ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టి చదివారు. మోదీ దేశానికి అందించిన సేవలను పలువురు మంత్రులు ప్రస్తావించారు. మోదీని 'రైట్ టైమ్-రైట్ ప్లేస్-రైట్ లీడర్'గా చంద్రబాబు అభివర్ణించారు. ప్రధానిగా ఉన్నప్పటికీ అందరి అభిప్రాయాలను స్వీకరిస్తారని, మంత్రులు కూడా ప్రజల మాటలను శ్రద్ధగా విని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం సూచించారు.

# మత్తు మహమ్మారికి ముకుతాడు

(మొదటి పేజీ తరువాయి)




యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాలు సమావేశాల నిర్వహించి డ్రగ్స్ పై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులను చైతన్యవంతం చేసేలా రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక ఉపాధ్యాయులకు బాధ్యతలు ఇవ్వనున్నట్లు మంత్రి లోకేష్ తెలిపారు. కేంద్రప్రభుత్వ నషా ముక్త్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో డ్రగ్స్ నివారణకు ఈగల్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సింథటిక్ డ్రగ్స్ నివారణపై పంజాబ్ పోలీసులు చేపడుతున్న విధానాలను అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఈగల్ విభాగం అధికారులకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ ను విశాఖపట్నంలో నిర్వహించాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై మంత్రులు పాల్గొనే ప్రతి సమావేశంలో ప్రస్తావించి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు. డ్రగ్స్ పై పెద్దఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రుల బృందం నిర్ణయించింది.

హోంమంత్రి అనిత మాట్లాడుతూ...ఒరిస్సా నుంచి రాష్ట్రంలోకి గంజాయి రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. ఒడిశా సరిహద్దుల్లోని చెక్ పోస్టుల్లో నిఘాను పటిష్టం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డ్రోన్ నిఘాను విస్తృతం చేయాలని సూచించారు. డ్రగ్స్ పై అవగాహనకు బ్రేక్ ద సైలెన్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ మాట్లాడుతూ... ఇటీవల విశాఖ, నర్సరావుపేటలో గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయని, అయితే అవి బీహార్, యుపి నుంచి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు. దీనిపై ఆయా రాష్ట్రాల్లోని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి అప్రమత్తం చేశామని అన్నారు. మత్తుకోసం షెడ్యూల్ డ్రగ్స్, కాఫ్ సిరప్ వంటివి వాడుతున్న వారిపై నిఘా వేసి ఉంచామని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆ మందులను విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేసినట్లు చెప్పారు. విజయవాడ, రాజమండ్రి నగరాల్లో డ్రగ్స్ ను ఉపయోగించే బ్లేడ్ బ్యాచ్ లను గుర్తించి, కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 సుశిక్షిత జాగిలాలను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగంపై అనుమానితులను గుర్తించి, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. డ్రగ్స్ కు సంబంధించి 192మంది యాక్టివ్ రిపీట్ అఫెండర్స్ ను గుర్తించి, వారిపై తీవ్రమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా, ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజిత్ పాల్గొన్నారు.

# గోదావరి డెల్టా ఆధునీకరణకు సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)



బుధవారం విజయవాడ లోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో గోదావరి డెల్టా ఆధునీకరణపై ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఐఐఎస్‌సి టెక్నాలజీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునీకరణలో భాగంగా ఇప్పటికే ఈస్ట్రన్ డెల్టాకు రూ. 1,137 కోట్లు, సెంట్రల్ డెల్టాకు రూ. 1,268 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. వెస్ట్రన్ డెల్టాకు సంబంధించిన అంచనాలను కూడా త్వరితగతిన సిద్ధం చేసి అందించాలని సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

డెల్టా ఆధునీకరణలో కాలువలు, డ్రెయిన్లు, బండ్‌ల స్థాయి, డీసిల్టింగ్, లాకులు, షట్టర్లు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. పూడికతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన సీ మౌత్‌ల వద్ద డ్రెడ్జింగ్ పనులకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

గోదావరి దిగువ ప్రాంతాల్లోని ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాల్లో, సముద్రంలో కలిసే డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి నిమ్మల తెలిపారు.

బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వాటి మరమ్మతులు చేపట్టడం లేదా అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపట్టడంపై సమగ్రంగా పరిశీలించాలని మంత్రి నిమ్మల అధికారులను ఆదేశించారు.

లైడార్ సర్వే నిర్వహించిన ఐఐఎస్‌సి టెక్నాలజీస్ ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు, డీపీఆర్‌లు సిద్ధం చేసే సమయంలో స్థానిక సాగు నీటి సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నిమ్మల సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలు, నీటి ప్రవాహ మార్గాలు, ముంపు ప్రాంతాలు, డ్రెయిన్ల పరిస్థితిపై సాగు నీటి సంఘాలు, ప్రజాప్రతినిధులకు ఉన్న అనుభవాన్ని సాంకేతిక సమాచారంతో సమన్వయం చేసి సమగ్ర డీపీఆర్‌లు రూపొందించాలని మంత్రి తెలిపారు.

డీపీఆర్‌లు పూర్తయిన అనంతరం వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. గోదావరి డెల్టా ఆధునీకరణ ద్వారా ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, సాగునీటి పారుదల వ్యవస్థను మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

# ఏపీకి పెట్టుబడుల జోరు!

(మొదటి పేజీ తరువాయి)

వీటిలో రూ. 5 లక్షల కోట్ల విలువైన 257 ప్రాజెక్టులు ఇప్పటికే క్షేత్రస్థాయికి చేరుకున్నాయని చెప్పారు.

భారతదేశంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 25.3 శాతంగా ఉందని మంత్రి తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పెట్టుబడిదారులు, మంత్రులు, ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూపుల ద్వారా నిరంతర సమన్వయం చేస్తున్నామని చెప్పారు. రూ. 21,498 కోట్ల విలువైన 31 ఎంఓయూలతో 92 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించే అవకాశాలు ఉన్నాయని, సుమారు రూ. 5 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని వివరించారు. నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ. 1.35 లక్షల కోట్లతో 18 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం, 55 వేల ఉద్యోగాల లక్ష్యంతో భారీ స్టీల్ ప్రాజెక్టును చేపడుతోందని భరత్ తెలిపారు. గూగుల్ 15 బిలియన్ డాలర్లతో 1 గిగావాట్ ఏఐ హబ్, రిలయన్స్ 17 బిలియన్ డాలర్లతో 1.5 గిగావాట్ ఏఐ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. 2030 నాటికి డేటా సెంటర్ల సామర్థ్యం 6.5 గిగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. స్టీల్, ఏఐ, డేటా సెంటర్లు, గ్రీన్ హైడ్రోజన్, రక్షణ, నౌకా నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్, స్పేస్, డ్రోన్ రంగాల్లో విశాఖ అభివృద్ధి చెందుతోందని మంత్రి అన్నారు. విశాఖను మరో బెంగళూరు లేదా హైదరాబాద్‌గా కాకుండా తనదైన గుర్తింపు, బలాలతో గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. 175 ఎంఎస్ఎంఈ పార్కులు, క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక కారిడార్లు, సెక్టోరియల్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని తెలిపారు.

# లిటిగేషన్‌పై ప్రభుత్వ 'పాలసీ' అస్త్రం



**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) విధివిధానాల ఖరారు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం బుధవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యక్షంగా, హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సతీష్ కుమార్ యాదవ్ లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. మంత్రివర్గ ఉప సంఘం న్యాయ శాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. లిటిగేషన్ పాలసీపై గతంలో నిర్వహించిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశా లలో సమీక్షించి, చేసిన సూచనల మేరకు న్యాయ శాఖకు చెందిన అధికారులు ఇతర రాష్ట్రాల్లో అమలుకు సంబంధించిన విధానాలను ఉప సంఘం దృష్టికి తీసుకువెళ్లారు. పబ్లిక్ లిటిగేషన్ పాలసీ అమల్లో ఉన్న ఇతర రాష్ట్రాలలో పర్యటించి అక్కడ అమలవుతున్న పబ్లిక్ లిటిగేషన్ పాలసీ కి సంబంధించిన పూర్తి వివరాలను మంత్రులకు న్యాయశాఖ సెక్రటరీ ప్రతిభా దేవి వివరించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ న్యాయ శాఖలో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, ప్రత్యమ్నాయ వివాద పరిష్కార ఫోరంలు ఏర్పాటు చేయడం, పారదర్శకత, జవాబుదారీతనంకు అనుగుణంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం"ను త్వరలోనే రూపొందిస్తామని వెల్లడించారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ కోర్ట్ కేసుల పరిష్కారం పై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా, అమలు కోసం ప్రత్యేకంగా పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు,ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటుకు సంబంధించి దృష్టి సారించాలని న్యాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ టూరిజానికి ఏఐ టచ్!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని 100కు పైగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాల్లో 'ASK AI' క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి, వాటిని స్కాన్ చేయడం ద్వారా 130కుపైగా భాషల్లో ఆయా ప్రాంతాల చరిత్ర, విశిష్టతలను తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు ప్రత్యేక యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదని, సేవలు పూర్తిగా ఉచితమని చెప్పారు. మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ విధానం విజయవంతమైందని, తొలిదశలో 30 ప్రధాన పర్యాటక గమ్యస్థానాలకు విస్తరిస్తామని వెల్లడించారు.

సాంకేతికత ద్వారా పర్యాటకులకు మెరుగైన అనుభవాన్ని అందించడంతో పాటు వారి ప్రాధాన్యతలు, భాషలు, ప్రయాణ విధానాలపై రియల్‌టైమ్ విశ్లేషణ ద్వారా భవిష్యత్ పర్యాటక ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని దుర్గేష్ పేర్కొన్నారు. ఏఐతో పాటు ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, డిజిటల్ ట్విన్స్ వంటి సాంకేతికతలను వినియోగించి ఏపీ ప్రకృతి, అటవీ, సాంస్కృతిక వనరులను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తామని చెప్పారు. స్మార్ట్ డెస్టినేషన్ అంటే కేవలం డేటా సేకరణ కాదని, పర్యాటక అనుభవాలను మెరుగుపరచడం, స్థానిక ఉపాధిని పెంచడం, బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు.

తిరుమల నుంచి అమరావతి బౌద్ధ వారసత్వం, గండికోట, మారేడుమిల్లి, అరకు, విశాఖ తీర ప్రాంతాల వరకు ఏపీ ఒకే యాత్రలో అపారమైన వైవిధ్యాన్ని అందించే గమ్యస్థానమని మంత్రి తెలిపారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ట్రావెల్-టెక్ సంస్థలు, స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలు, పర్యాటక ఆపరేటర్లు, పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "భారతదేశాన్ని చూసేశామని అనుకుంటే.. ఒకసారి ఆంధ్రప్రదేశ్‌కు రండి.. మిమ్మల్ని ఖచ్చితంగా ఆశ్చర్యపరుస్తాం" అని పేర్కొంటూ పర్యాటకులుగా మాత్రమే కాకుండా భాగస్వాములుగా ఏపీకి రావాలని గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు.

# ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రూబీ జూబ్లీ వేడుకలకు గవర్నర్



- **అక్టోబర్ 26న 40వ వార్షికోత్సవ వేడుకలు**

**విజయవాడ, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** డా. ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అక్టోబర్ 26న నిర్వహించనున్న రూబీ జూబ్లీ వేడుకలకు హాజరయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సమ్మతి తెలిపారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ టి. సాయి సుధీర్, డైరెక్టర్ ఆర్అండ్‌డీ ఎం.ఎల్. సూర్యప్రభ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వేడుకలకు అధికారిక ఆహ్వానం అందజేశారు.
ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానం, వైద్య, ఆరోగ్య విజ్ఞాన విద్యారంగంలో సాధించిన పురోగతి, విద్యా ప్రమాణాల పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాలు, పరిశోధనకు ఇస్తున్న ప్రాధాన్యత, ఆరోగ్య రంగానికి అందిస్తున్న సేవలను ప్రతినిధి బృందం గవర్నర్‌కు వివరించింది. నాలుగు దశాబ్దాలుగా విశ్వవిద్యాలయం సాధించిన విజయాలను స్మరించుకోవడంతో పాటు భవిష్యత్తులో వైద్య విద్య, పరిశోధన, ఆరోగ్య విజ్ఞాన రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు రూబీ జూబ్లీ వేడుకలు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.
అక్టోబర్ 26న జరిగే రూబీ జూబ్లీ వేడుకలకు హాజరై విశ్వవిద్యాలయ కుటుంబాన్ని ఆశీర్వదించాలని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కోరింది. ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన గవర్నర్ వేడుకలకు హాజరయ్యేందుకు సమ్మతి తెలిపారు. గవర్నర్ సమ్మతి పట్ల వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ టి. సాయి సుధీర్, డైరెక్టర్ ఆర్అండ్‌డీ ఎం.ఎల్. సూర్యప్రభ హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానానికి ప్రతీకగా నిలిచే రూబీ జూబ్లీ వేడుకలను ఘనంగా, స్మరణీయంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# కడప ఉర్సు ఉత్సవాలకు మంత్రి ఫరూక్‌కు ఆహ్వానం

**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను దర్గా ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం వెలగపూడి సచివాలయం లోని మూడవ బ్లాక్ లో ఉన్న మంత్రి పేషీ కార్యాలయంలో మంత్రికి దర్గా ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 24 నుంచి 29 వరకూ జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి మంత్రి ఫరూక్ ఆరా తీశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని ప్రతినిధుల బృందానికి మంత్రి ఫరూక్ సూచించారు.

# ప్రజల విశ్వాసంతోనే 25 ఏళ్ల ప్రస్థానం



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల విశ్వాసం, ఆశీస్సులతోనే తన 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం కొనసాగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రజాజీవితంలో ఎదురైన ప్రతి అనుభవాన్ని ఒక పాఠంగా స్వీకరించానని, తనను తాను ఎప్పటికీ నిత్య విద్యార్థిగానే భావిస్తానని పేర్కొన్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.
గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి 2001 అక్టోబర్ 7న పదవీ ప్రమాణం చేసిన నరేంద్ర మోడీ.. ఆ తర్వాత పలు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2014లో దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి వరుసగా మూడు పర్యాయాలు ఆ పదవిలో కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో ప్రధాని మోడీ ప్రసంగించారు.
**ప్రజల ఆశీస్సులే బలం :** తాను 25 ఏళ్ల పాటు నిరంతరంగా ప్రజాసేవలో కొనసాగుతానని గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసిన సమయంలో ఊహించలేదని మోడీ అన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకం, అందించిన ఆశీస్సులే ఇంత సుదీర్ఘ ప్రస్థానానికి ప్రధాన కారణమని చెప్పారు.
"ప్రజల విశ్వాసమే నా బలం. ప్రజల ఆశీస్సులతోనే ఇంతకాలం దేశసేవ చేసే అవకాశం లభించింది. ప్రజాజీవితంలో ప్రతి రోజు ఒక కొత్త అనుభవాన్ని అందిస్తుంది. ప్రతి అనుభవం మనకు ఏదో ఒక విషయాన్ని నేర్పుతుంది. అందుకే ఎదురైన ప్రతి పరిస్థితిని ఒక పాఠంగా స్వీకరించాను" అని ప్రధాని పేర్కొన్నారు.
ప్రజాసేవలో ఉన్నవారికి విమర్శలు సహజమేనని మోడీ అన్నారు. విమర్శలకు అధిక ప్రాధాన్యం ఇస్తే లక్ష్య సాధన దెబ్బతింటుందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం, దేశ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించారు.
"ప్రజాజీవితంలో విమర్శలు వస్తూనే ఉంటాయి. వాటిని పట్టించుకుంటూ కూర్చుంటే ముందుకు సాగలేం. మన లక్ష్యంపై దృష్టి పెట్టాలి. దేశ ప్రయోజనాలను ముందుగా ఉంచుకుని పనిచేయాలి" అని అన్నారు.
భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని సాధించి తీరుతామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. దేశంలోని యువత, రైతులు, మహిళలు, పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తల సామర్థ్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు.
ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణం సాధ్యమేనని, భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడం కూడా సాధ్యమేనని చెప్పారు. దేశం సాధిస్తున్న పురోగతితో ప్రపంచం మొత్తం భారత్‌వైపు చూస్తోందన్నారు.
భారత్ అన్ని రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని మోడీ అన్నారు. అంతరిక్ష రంగంలో భారత శాస్త్రవేత్తలు సాధిస్తున్న విజయాలు దేశ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాల్సి ఉందని చెప్పారు.

# కారుణ్య నియామకాల్లో జెట్ స్పీడ్

**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కారుణ్య నియామకాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితికి స్వస్తి పలికి, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు నాలుగు నెలల్లోనే నియామక ఉత్తర్వులు ఇస్తున్నామని చెప్పారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ జెన్‌కోలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 27 మంది అర్హులకు మంత్రి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ నాగలక్ష్మి పాల్గొన్నారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 627 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశామని మంత్రి తెలిపారు. ఉద్యోగులను కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. విద్యుత్ శాఖలో మానవ వనరుల కొరతను అధిగమించేందుకు సుమారు 7 వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోనున్నట్లు చెప్పారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు 629 ఏఈ పోస్టులను భర్తీ చేస్తున్నామని, నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేసినా ప్రభుత్వం సమర్థవంతంగా




ఎదుర్కొంటోందన్నారు.
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని గొట్టిపాటి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖను మరింత బలోపేతం చేసే దిశగా సాహసోపేత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా లోఓల్టేజ్ సమస్యను నివారించడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 132, 220, 400 కేవీ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని తెలిపారు. డిస్కంల పరిధిలోనూ 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. గృహ, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో విద్యుత్ కొనుగోలు చేసి డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి పీక్ అవర్స్‌లోనూ రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామని అన్నారు.
పునరుత్పాదక విద్యుత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 2 లక్షల వరకు రాయితీ లభించే సూర్యఘర్ కనెక్షన్లను ఏర్పాటు చేశామని, దేశవ్యాప్తంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానానికి చేరిందన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు బొగ్గు నిల్వలు పెంచడంతో పాటు విద్యుత్ ప్లాంట్లలో మరమ్మతులు చేపట్టి ఉత్పత్తిని పెంచామని చెప్పారు.
కొత్తగా ఉద్యోగాల్లో చేరే సిబ్బంది పూర్తిస్థాయి శిక్షణ పొందిన తర్వాత విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. విద్యుత్ రంగంలో భద్రత, బాధ్యత అత్యంత కీలకమన్నారు. ప్రజల సంతృప్తి మరింత పెరిగేలా, సంస్థకు మంచి పేరు వచ్చే విధంగా ఉద్యోగులు విధులు నిర్వహించాలని కోరారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

# రూ.లక్ష కోట్లకుపైగా ప్రాజెక్టులు

**విశాఖపట్నం, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకువచ్చే సంస్థల ప్రాజెక్టులు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఐఐఎం విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతూ పెట్టుబడిదారులకు భూమి, విద్యుత్, నైపుణ్య మానవ వనరులతో పాటు రవాణా, లాజిస్టిక్స్ సదుపాయాలు కీలకమన్నారు.
లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించి రోడ్లు, పోర్టులు, రైల్వేలు, టెర్మినల్స్‌ను అనుసంధానించే మల్టీ-మోడల్ కనెక్టివిటీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి చెప్పారు. 'లీడ్స్--2025' నివేదికలో తీరప్రాంత రాష్ట్రాల విభాగంలో ఆంధ్రప్రదేశ్ 'యాక్సిలరేటర్స్' జాబితాలో చోటు దక్కించుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తూ పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
రాష్ట్రంలో రూ.లక్ష కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులు నిర్మాణ, డీపీఆర్ దశల్లో ఉన్నాయని బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. 2024-25, 2025-26లో ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో రూ. 24 వేల కోట్లతో 1,530 కిలోమీటర్ల రహదారి ఆస్తులను అభివృద్ధి చేశామని, ఈ విషయంలో దేశంలో ఏపీ మూడో స్థానంలో నిలిచిందన్నారు. సుమారు రూ. 31 వేల కోట్ల అమరావతి ఔటర్ రింగ్ రోడ్



ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిని రోడ్లు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలతో అనుసంధానిస్తున్నామని మంత్రి తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అనకాపల్లిలో మరో మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ పార్కు ఏర్పాటుపై అధ్యయనం జరుగుతోందన్నారు. ప్రతిపాదిత లాజిస్టిక్స్ పాలసీలో నాలుగు మల్టీ-మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, ఆరు ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కులు, 22 ట్రక్ టెర్మినల్స్, 300 కోల్డ్ స్టోరేజీల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఆక్వా, సీఫుడ్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, లోహాలు, ఖనిజాలు, రసాయన పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. కోల్డ్‌చైన్, బల్క్ హ్యాండ్లింగ్, రైల్వే సైడింగ్స్ వంటి సదుపాయాలతో పాటు 'ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్' యాప్, 'లాజిస్టిక్స్ అనలిటిక్స్ డ్యాష్‌బోర్డ్' వంటి డిజిటల్ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా లాజిస్టిక్స్ పార్కులు, ట్రక్ టెర్మినల్స్, కోల్డ్‌చైన్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.
మౌలిక సదుపాయాలు నిర్మించడమే కాకుండా పరిశ్రమలకు ఎక్కడ అత్యవసరంగా అవసరమో అక్కడే వాటిని ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డెవలపర్లు, లాజిస్టిక్స్ కంపెనీలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్, టెక్నాలజీ సంస్థలు, తయారీదారులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు జాయింట్ వెంచర్లు, పీపీపీ లేదా స్వతంత్ర పెట్టుబడుల ద్వారా భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. సుమారు రూ. లక్ష కోట్ల విలువైన రోడ్ల ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నాయని, ఏపీ తదుపరి వృద్ధి పథంలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు.

## సీట్ల సర్దుబాటుపై 3 రోజుల్లో స్పష్టత..

**అమరావతి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. చర్చలు కొనసాగుతున్నాయని, ఇప్పటికే నాలుగు దఫాలుగా భాగస్వామ్య పక్షాలతో సమావేశాలు నిర్వహించి కేటాయింపుపై ఒక అవగాహనకు వచ్చామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుది నిర్ణయానికి బిసి రిజర్వేషన్ల అంశం కీలకంగా మారిందన్నారు. 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున బిసి, ఒసి తదితర కేటగిరీల వారీ అభ్యర్థులను ఖరారు చేయలేకపోతున్నామని తెలిపారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నదే టిడిపి విధానమని తెలిపారు. హైకోర్టు తీర్పుతో రిజర్వేషన్లకు విఘాతం కలగడంపై కొంత నిరాశ ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టులో సానుకూల ఫలితం వస్తుందన్న ఆశాభావంతో ఉన్నామని వెల్లడించారు. న్యాయపరంగా సాధ్యం కాకపోతే పార్టీ పరంగా 34 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని, కూటమి పార్టీలు కూడా దీనికి కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. ?ఈ విషయంలో వైసిపి ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన వెంటనే నియోజకవర్గాల వారీ అభ్యర్థుల ఎంపికకు తుదిరూపు ఇస్తామని తెలిపారు.

## మథుర గురుకులంలో విషాదం



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లోని మథురలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఇక్కడ బృందావనంలోని ఒక గురుకులంలో భూగర్భ వాటర్ ట్యాంకులోకి దిగి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మహర్షి పాణిని సంస్కృత గురుకులంలో ఈ వాటర్ ట్యాంక్ కొంతకాలంగా వినియోగంలో లేదు. ఇటీవల కాలంలో ఈ ట్యాంక్ నుంచి దుర్వాసన వస్తుంది. ఈ దుర్వాసనను పరిశీలించడానికి ఒకరి తరువాత ఒకరు వెళ్లిన నలుగురు విద్యార్థులు విషవాయువు పీల్చి మరణించారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గురుకులం యజమానులిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మథుర సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్-ఎస్‌పి ) శ్లోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 15 అడుగుల లోతు ఉన్న ఆ నీటి ట్యాంకు వినియోగంలో లేదు, దానిపై కాంక్రీటు మూత ఉంది. దుర్వాసన ఎక్కువగా వస్తుండటంతో ముందుగా ట్యాంక్‌లో నీటిని బకెట్లతో తీయడానికి విద్యార్థులు ప్రయత్నించారు. తరువాత ఒక విద్యార్థి ట్యాంకులోకి వెళ్లడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు. మెట్ల ద్వారా ట్యాంకు కిందకు వెళ్లిన అతను ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో మరో నలుగురు విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు కిందకు వెళ్లారు. వీరందరూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో బయట ఉన్న ఇతర విద్యార్థులు, సిబ్బంది, స్థానికులు కలిసి ఆ ఐదుగురు విద్యార్థులను ట్యాంకులోంచి బయటకు తీశారు. మరో వైపు ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసు బృందం విద్యార్థులకు సిపిఆర్, ప్రథమ చికిత్స అందించి, హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ వీరిలో నలుగురు విద్యార్థులు మృతి చెందారు. మృతుల్ని జబల్‌పూర్‌కు చెందిన మను కటారే (21), మీరట్, కౌశాంబీ, విదిశకు చెందిన విషు, ఆర్యన్ (18), దేవాన్ష్ (17) గా గుర్తించారు. మరో విద్యార్థి ప్రాణపాయం నుంచి బయట పడగా, ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది.

# తండ్రి పేరు పిల్లల భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదు

- **బాలల హక్కుల పరిరక్షణకు ఏకరీతి, బాలల హక్కులకు అనుకూలమైన విధానం అవసరం: ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు**

**విజయవాడ, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** తండ్రి పేరు అందుబాటులో లేకపోవడం లేదా వెల్లడించలేని పరిస్థితి కారణంగా ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, సంక్షేమ ప్రయోజనాలు లేదా ఇతర అవసరమైన ప్రభుత్వ సేవలు నిరాకరించబడకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు అన్నారు. ఈ విషయంలో దేశవ్యాప్తంగా అమలు చేయగల ఏకరీతి విధానం మరియు పరిపాలనా వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.
బెంగళూరులోని ది క్యాపిటల్ హోటల్‌లో కర్ణాటక రాష్ట్ర న్యాయ సేవా సంస్థ మరియు చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి సమావేశంలో గాంధీబాబు ప్రసంగించారు. జనన ధృవీకరణ పత్రాలు, పాఠశాల రికార్డులు, గుర్తింపు పత్రాలు, ప్రభుత్వ సేవలు పొందే సమయంలో తండ్రి వివరాలకు సంబంధించిన ప్రశ్నలను ఎదుర్కొంటున్న పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.
ఈ సమస్యను సంప్రదాయ కుటుంబ గుర్తింపు భావనల ఆధారంగా కాకుండా, ప్రధానంగా బాలల హక్కులు, గౌరవం మరియు గోప్యత అనే దృక్కోణంలో చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా తండ్రి ఎవరో తెలియని సందర్భాల్లో, తండ్రి వివరాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో లేదా వాటిని వెల్లడించలేని సందర్భాల్లో, పిల్లలు తమ జనన పరిస్థితుల



పర్యవసానాలను భరించే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు.
వ్యభిచార వృత్తిలో ఉన్న మహిళలకు జన్మించిన పిల్లలు, వివాహానికి ముందే గర్భం దాల్చిన యువతుల పిల్లలు, అలాగే ప్రత్యేక సామాజిక పరిస్థితులను ఎదుర్కొంటున్న తల్లుల పిల్లలు ఇటువంటి సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని గాంధీబాబు పేర్కొన్నారు. "నీ తండ్రి ఎవరు?" అనే ప్రశ్నను పదేపదే ఎదుర్కోవడం వల్ల చిన్నారులు తమ విద్య మరియు భవిష్యత్తును నిర్మించుకునే కీలక దశలోనే సామాజిక ముద్ర, అవమానం మరియు వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు.
రాజ్యాంగ సూత్రాలు, న్యాయస్థానాల తీర్పులు మరియు లిలివిద్యా హక్కు చట్టం (=అస్త్రష్ట్ శీ జుంబఎఖ్అశీఅ ాచాఖ్)లిలిను ప్రస్తావిస్తూ, పరిపాలనా విధానాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లల ప్రాథమిక హక్కులకు అడ్డంకిగా మారకూడదని గాంధీబాబు అన్నారు. కేవలం అధికారిక పత్రాలను పూర్తి చేయడం కోసం తప్పుడు లేదా కల్పిత తండ్రి పేరును నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో పిల్లలు మరిన్ని గుర్తింపు సంబంధిత సమస్యలు, సామాజిక వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.
ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు మరియు ప్రజలకు సేవలు అందించే అన్ని వ్యవస్థల్లో స్పష్టమైన, ఏకరీతి మరియు బాలల హక్కులకు అనుకూలమైన విధానం అమలు చేయాలని ఆయన కోరారు. తండ్రి వివరాలు అందుబాటులో లేని కారణంగా పిల్లలు తప్పుడు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి లేకుండా, అవసరమైన పత్రాలు మరియు సేవలను సులభంగా పొందే విధానం ఉండాలని సూచించారు.
తన క్షేత్రస్థాయి అనుభవాలను పంచుకుంటూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలో గిరిజన మహిళలకు సంబంధించిన కొన్ని సంఘటనలను గాంధీబాబు ప్రస్తావించారు. వ్యాపార నిమిత్తం గిరిజన ప్రాంతాలకు వచ్చిన కొంతమంది వ్యక్తులు గిరిజన మహిళలతో సంబంధాలు ఏర్పరచుకుని, కొందరిని వివాహం చేసుకున్న అనంతరం వారిని వదిలి వెళ్లిపోయిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ఫలితంగా సుమారు 270 మంది యువతులు గర్భం దాల్చారని, ఆ తరువాత వారి పిల్లలు తండ్రి వివరాలు లేకపోవడం లేదా స్పష్టత లేకపోవడం వల్ల అనేక సామాజిక సమస్యలను ఎదుర్కొన్నారని చెప్పారు.
ఈ మహిళలు మరియు వారి పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన అనంతరం, తాను నిర్వహిస్తున్న అగ్రికల్చర్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా వారికి న్యాయ సహాయం అందించినట్లు గాంధీబాబు తెలిపారు. ఇటువంటి అనుభవాలు ఒక్కో కేసును విడివిడిగా పరిష్కరించడం కంటే, వ్యవస్థాగతమైన మరియు శాశ్వత పరిష్కారం అవసరమని స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు.
పిల్లల గౌరవం, గోప్యత మరియు హక్కులను పరిరక్షించే విధానాలను ప్రభుత్వాలు, సంస్థలు రూపొందించాలని గాంధీబాబు కోరారు. అదే సమయంలో విద్య, గుర్తింపు పత్రాలు, సంక్షేమ పథకాలు మరియు ఇతర చట్టబద్ధమైన ప్రయోజనాలను పిల్లలు ఎలాంటి అంతరాయం లేకుండా పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
"ఒక చిన్నారి భవిష్యత్తు ఆ చిన్నారి తండ్రి పేరు చెప్పగలదా లేదా అనే అంశంపై ఆధారపడకూడదు. పిల్లలు తమ జనన పరిస్థితులకు సంబంధించిన సామాజిక పరిణామాలను మోయాల్సిన పరిస్థితి రాకూడదు" అని గాంధీబాబు అన్నారు. ప్రతి చిన్నారికి హక్కులు మరియు అవకాశాలు సమానంగా అందేలా బాలల హక్కుల ఆధారిత వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. పిల్లలను ప్రభావితం చేస్తున్న వ్యవస్థాగత మరియు పరిపాలనా అడ్డంకులను తొలగించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని గాంధీబాబు తెలిపారు. పిల్లలు జన్మించిన పరిస్థితులు లేదా తండ్రి పేరు అందుబాటులో లేకపోవడం కారణంగా ఎలాంటి వివక్షకు గురికాకుండా, ప్రతి చిన్నారికి విద్య, గుర్తింపు, రక్షణ మరియు సమాన అవకాశాలు లభించే వ్యవస్థ కోసం తాను కృషి కొనసాగిస్తానని ఆయన అన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను నెరవేర్చుతాం

- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన మంత్రులు
- మహిళా లబ్ధిదారులతో కొబ్బరికాయలు కొట్టించి పనులు ప్రారంభం





**కుత్బుల్లాపూర్, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చుతామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కైసర్ నగర్ సర్వేనెంబర్ 346 లోని తెలంగాణ హౌసింగ్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించామన్నారు. 7500 దరఖాస్తులు చేసుకోగా 480 మందిని లాటరీ విధానం ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. విడతలవారీగా మరింత మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. సంవత్సరం లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అంద జేస్తామని హామీఇచ్చారు.

**ఇళ్లతో పాటు సౌకర్యాలు కల్పించాలి:ఎమ్మెల్యే వివేకానంద్**

లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరుస్తూ వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించడంతోపాటు ప్రార్థన మందిరాలు, వైకుంఠ ధామాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ స్థానిక మున్సిపల్ శాఖలను సమన్వయం చేస్తూ త్రాగునీటి, డ్రైనేజీ వ్యవస్థలు అభివృద్ధి చేయాలని కోరారు.

**అన్ని వసతులతో గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం :మంత్రి శ్రీధర్ బాబు**

లబ్ధిదారులకు అన్ని వసతులతో గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. పిల్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. త్వరితగతిన పనులు చేపట్టి నిర్ణీత సమయంలోపు లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తామని తెలిపారు. ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూసామని ఆ కల ఈ ప్రభుత్వంలో ఇప్పుడు సహకారం అవుతుందని పలువురు మహిళా లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

# బీసీల హక్కుల కోసం పోరాటం ఆగదు!

- జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టే వరకు ఉద్యమం
- శంషాబాద్ సింహగర్జన సభతో బీసీల సంఘటిత శక్తి చాటాం
- తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్రం అనుమతించాలి
- టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కడ్తాల్, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా,హక్కులు దక్కాలంటే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడం అత్యంత కీలకమని టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్,షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టే వరకు కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షాన ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.బీసీల సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి పరిస్థితులను కచ్చితంగా అంచనా వేసేందుకు సమగ్ర గణాంకాలు అవసరమని పేర్కొన్నారు.

**వీర్లపల్లి శంకర్‌ను సన్మానించిన ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**

శంషాబాద్‌లో టీపీసీసీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సింహగర్జన సభ విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వీర్లపల్లి శంకర్‌ను కలెక్టరేట్ వద్ద ఘనంగా సత్కరించారు.టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్‌కు పూలమాలలు,శాలువాలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీల మాదిరిగానే బీసీల జనాభాను కూడా అధికారికంగా లెక్కించి,ఆ గణాంకాల ఆధారంగా సంక్షేమ,రిజర్వేషన్ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బీసీల కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

**తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ల కోసం..**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ అంశాలతో కూడిన సమగ్ర కుల సర్వే నిర్వహించిందని శంకర్ తెలిపారు.ఈ సర్వే ఆధారంగా స్థానిక సంస్థలు,విద్య,ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను రాష్ట్ర శాసనసభ ఆమోదించిందని పేర్కొన్నారు.ఆ బిల్లులకు కేంద్రం అనుమతి ఇవ్వకుండా జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు.బీసీల జనాభా ఎంత? వారికి జనాభా ప్రాతిపదికన దక్కాల్సిన వాటా ఎంత? అనే అంశాలపై స్పష్టమైన గణాంకాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు.కులగణన ద్వారా బీసీల వాస్తవ జనాభా,వారి సామాజిక,విద్యా,ఆర్థిక పరిస్థితులు వెలుగులోకి వస్తాయని తెలిపారు.

**దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపు**

బీసీల కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని శంకర్ అన్నారు.అవసరమైతే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు.శంషాబాద్‌లో నిర్వహించిన సింహగర్జన సభ ద్వారా తెలంగాణలో బీసీల సంఘటిత శక్తిని చాటామని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. పార్టీ కోసం కష్టపడే నాయకులు,కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు.బీసీల సంక్షేమం, ఆత్మగౌరవం పెంపొం దించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. సింహగర్జన సభ విజయవంతానికి కృషి చేసిన టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్‌ను ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శులు చేగురి వెంకటేష్, రఘు రాములు, నాయకులు బిచ్యా నాయక్,జహంగీర్ అలీ,కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శివలింగం,రేణురెడ్డి,రఘుపతి,చంద్రు నాయక్, గోవర్దన్, శివ, శ్రీనివాస్ గౌడ్, నరసింహారెడ్డి, జితేందర్‌రెడ్డి, అశోక్ యాదవ్, శ్రీను నాయక్,మహేష్,విజయ్ నాయక్, వసుపుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి

- పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈఓ రేణుకాదేవి



**మేడ్చల్, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి సూచించారు.మంగళవారం మేడ్చల్ మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) రథంశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. శంకరాగౌడ్తో కలిసి పాఠశాలలోని వివిధ విభాగాలను, విద్యాబోధన తీరును పరిశీలించారు.

విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటగది పరిశుభ్రత, ఆహార తయారీ ప్రమాణాలను డీఈఓ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారువిద్యార్థుల అభ్యాస సామర్థ్యాల పరిశీలన,విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను తెలుసుకునేందుకు వారితో వర్క్ బుక్స్ ద్వారా తెలుగు పఠనం చేయించారు. విద్యార్థుల చదువు స్థాయి, పఠనా నైపుణ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల ప్రదర్శన మెరుగ్గా ఉండటంపై డీఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు.చిన్నారుల అభ్యాస తరగతులను సందర్శించిన ఆమె.. ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులను పరిశీలిం చారు. బొమ్మలు, ఆటల ద్వారా పిల్లలకు బోధిస్తున్న కార్యకలాపాలను సమీక్షించారు. చిన్నారుల్లో ఆసక్తి, అభ్యాస సామర్థ్యాలను పెంచేలా బోధనా విధానాలను కొనసాగించాలని సూచించారు.రికార్డుల నిర్వహణపై ఆదేశాలు

పాఠశాలకు సంబంధించిన పరిపాలనా, అకడమిక్ రిజిస్టర్లను డీఈఓ పరిశీలించారు. అకడమిక్, పరిపాలనా రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. విద్యా నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచేం దుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో గుణాత్మక విద్య అందించడం, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించడం, పరిశుభ్రతను పాటించడం, సమర్థవంతమైన పాఠశాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించే లక్ష్యంతో తనిఖీ నిర్వహించినట్లు ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వై. శంకరాగౌడ్ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- సుతారిగూడలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**మేడ్చల్ అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంగళవారం గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని సుతారిగూడలో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను పౌర సరఫరాల శాఖ అధికారులు, స్థానిక రేషన్ డీలర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమక్షంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డు పేద కుటుంబాలకు ఎంతో కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటాం అన్నారు. రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అని అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చూస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్, ఓబీసీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి ముదిరాజ్, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచులు బేరి ఈశ్వర్, బండారి నరేందర్ ముదిరాజ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, కండ్లకొయ్య మాజీ ఉపసర్పంచ్ చిల్ల వెంకటేష్ ముదిరాజ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకారబోయిన మల్లేష్ ముదిరాజ్, గౌడవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్. వినోద్ గౌడ్, కర్రోల్ల సంతోష్, గుండ్ల పోచంపల్లి సేవాదళ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిల్ల సాయి ముదిరాజ్, చింతల పెంటయ్య ముదిరాజ్, చింతల భాస్కర్ ముదిరాజ్, చింతల హరిబాబు ముదిరాజ్, సుతారిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజు ముదిరాజ్, లేబర్ సెల్ అధ్యక్షుడు భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కూల్చివేత తప్పదు..

- మల్కాజిగిరి జోన్‌లో అక్రమ నిర్మాణాలు, అదనపు అంతస్తుల కూల్చివేత



**మల్కాజిగిరి అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజిగిరి జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపిం చారు. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలతో పాటు, మంజూరైన భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మిం చిన అదనపు అంతస్తులపై అధి కారులు చర్యలు చేపట్టారు. మౌలాలీ సర్కిల్-4 పరిధిలోని సింహాద్రి నగర్‌లో అనుమ తులు లేకుండా చేపట్టిన అనధికార నిర్మాణాన్ని ఎంఎంసీ సిబ్బంది కూల్చివేశారు. అదే విధంగా మల్కాజిగిరి సర్కిల్--5 పరిధిలోని ప్రశాంత్ నగర్, పి.వి.ఎన్. కాలనీ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులను తొలగించి, నిర్మాణ పనులను నిలిపివేశారు. కూల్చివేత చర్యల్లో ఎంఎంసీ మౌలాలీ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌రావుతో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మల్కాజిగిరి జోన్ పరిధిలో అనధికార నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. భవన నిర్మాణాలు చేపట్టే ముందు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. అనుమతి పొందిన ప్లాన్‌కు భిన్నంగా నిర్మాణాలు చేపట్టడం, అదనపు అంతస్తులు నిర్మించడం, ఇతర నిబంధనలను ఉల్లంఘించడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు నిర్మాణ నిబంధనలను పాటించి, ముందస్తు అనుమతులతోనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు సూచించారు.

# చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం



**చందానగర్, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మాజ్ కాలనీకి చెందిన దేవులపల్లి రామకృష్ణారెడ్డి (34) సెప్టెంబర్ 28న ఉదయం 8 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన మొబైల్ ఫోన్లు కూడా స్విచ్‌ఆఫ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.గల్లంతైన వ్యక్తి తెలుపు రంగు, సుమారు 5.4 అడుగుల ఎత్తు, గుండ్రని ముఖంతో ఉండి, అదృశ్యమైన సమయంలో తెల్లటి షర్ట్, నీలం జీన్స్ ధరించి ఉన్నాడు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేస్తున్నారు.రామకృష్ణారెడ్డి ఆచూకీ తెలిసిన వారు 9959813100, 7075584454 నంబర్లకు లేదా చందానగర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు సన్మానం



**మంచిర్యాల అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచలాపూర్ గ్రామంలో రాష్ట్రపార్టీ పిలుపుమేరకు మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ సూచన మేరకు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నౌనూరి సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు మరియు ఆయాలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవకు ప్రతీకగా జరుగుతున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా... సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా 'అంగన్వాడీ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించబడుతున్నాయి. సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యాన్ని కాపాడడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి ఆయన కొనియాడారు. మన దేశ భవిష్యత్తు ఆ దేశ బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది కావున ఆ బాలలకు సరైన పోషకాహారం, ప్రాథమిక విద్యను అందించి వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు ఎలా చూసుకుంటారో, కేంద్రానికి వచ్చిన ప్రతి చిన్నారినీ అంతకంటే ఎక్కువగా ప్రేమతో ఆప్యాయతతో చూసుకునే 'అంగన్వాడీ దీదీల' సేవలు వెలకట్టలేనివి అని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బిజెపి మండల ఉపాధ్యక్షులు కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఈర్ల సంతోష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అడ్వాల సతీష్, వార్డు సభ్యులు వరిమడ్ల విజయ్, గంగాధరి శ్రీనివాస్, ఏముర్ల రవి కుమార్, బొగరపు సతీష్, కొటం రమేష్, ఎల్లెల శ్రీనివాస్, సంగర్తి భాణేష్ ఉపేందర్ జూపాక నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు అండగా సేవా సంకల్ప అభియాన్

- బిహారి బస్తీలో చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ.. అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం



**మల్కాజిగిరి, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజిగిరిలోని బిహారి బస్తీలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడీ టీచర్లను శాలువాలతో సన్మానించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు అంగన్వాడీ మిలన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చిన్నారులకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేస్తూ, అంగన్వాడీ సిబ్బందిని ప్రోత్సహిస్తున్నారు.ఈ సందర్భంగా ఎన్. రామ చంద్రరావు మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు పరిమిత వేతనాలతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ చిన్నారుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. బాలల విద్య, ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక అభివృద్ధిలో అంగన్వాడీ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, అంగన్వాడీ సిబ్బందికి సమాజం నుంచి గౌరవం, ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, స్థానికులు పాల్గొన్నారు.

# తలసాని జన్మదినం శ్రేణుల ఉచిత కంటి శిబిరం



**సికింద్రాబాద్: అక్టోబరు 07(జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరిం చుకుని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోశిక దేవేందర్ ఆధ్వర్యంలో జై నగర్ కాలనీలో మంగళ వారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు.తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పద్మారావునగర్ డివిజన్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్,ఎస్.రాజేందర్, విజయ్‌శంకర్, దేశపాక శ్రీనివాస్, ఓ.రాజు, కుమార్‌యాదవ్, అరుణ్‌కుమార్‌గౌడ్, వెంకటేష్‌రాజు, ప్రేమ్‌కుమార్, నిమ్మ నాగలక్ష్మి,కె.మధు,హరి పాల్గొన్నారు.

# బేగంపేట్ సీఎం ప్రజావాణిలో 196 దరఖాస్తులు



**బేగంపేట్, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** బేగంపేట్ ప్రజా భవన్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 196 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు.రెవెన్యూ శాఖకు 67, బీసీ సంక్షేమ శాఖకు 24, మున్సిపల్ శాఖకు 26, ఇతర శాఖలకు 79 దరఖాస్తులు రాగా....సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమస్య పరికరించాలని చెప్పారు.ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులకు గద్వాల్ విజయలక్ష్మి భరోసా ఇచ్చారు.ఆర్టీసీ లో వివిధ కారణాలతో ఉద్యోగం కోల్పోయిన కార్మికులు ప్రజావాణికి వచ్చి తమను విధుల్లోకి చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మిని కోరగా రవాణా శాఖ మంత్రి సహా ఆర్టీసీ ఎండీతో మాట్లాడి సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే 317 మందికి ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు తిరిగి విధుల్లోకి చేరే విధంగా చర్యలు తీసుకున్నట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కస్టమర్ కేర్ పేరుతో రూ.2 లక్షల మోసం

- చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో క్రెడిట్ కార్డుల నుంచి నగదు కాజేత

**శేర్లింగంపల్లి అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** కస్టమర్ కేర్ నంబరుగా గూగుల్‌లో కనిపించిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయడంతో సైబర్ మోసానికి గురై రూ.2,00,215.82 నష్టపోయిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు మద్దుకూరి సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబరు 2న సాయంత్రం 5.30 గంటలకు 'టీ వాలెట్' యాప్‌లో కేవైసీ చేసేందుకు ప్రయత్నించారు. గూగుల్‌లో వెతకగా కస్టమర్ కేర్ నంబరుగా 9155211694 కనిపించడంతో దానికి ఫోన్ చేశారు.ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తులు పేరు, పుట్టిన తేదీ తదితర వివరాలు అడిగి, కేవైసీ కోసం 'సీఎస్ యాప్'ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. అనంతరం ఫోన్ కట్ చేసిన వెంటనే యాక్సిస్ బ్యాంకు, ఆర్‌బీ843 క్రెడిట్ కార్డుల నుంచి నగదు డెబిట్ అయినట్లు సందేశాలు వచ్చాయి. వెంటనే రెండు కార్డులను బ్లాక్ చేయించారు. అప్పటికే 10 లావాదేవీల్లో మొత్తం రూ.2,00,215.82 కట్ అయినట్లు తెలిపారు.ఈ ఘటనపై అక్టోబరు 4న సైబర్ క్రైమ్‌లో 33710260051993 నంబరుతో ఫిర్యాదు చేశారు. అనంతరం చందానగర్ పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసి, 9155211694 నంబర్ ఆధారంగా నిందితులను గుర్తించి కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. తన నగదును తిరిగి ఇప్పించడంతోపాటు నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

- ప్రజలు ప్లాస్టిక్ వస్తువులను బహిష్కరించాలి : బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ మారుతి వీరభద్ర ప్రసాద్

**ఖమ్మం , అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు మానవులు, జంతువుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని బీజేపీ ధార్మిక సెల్ ఖమ్మం జిల్లా కన్వీనర్ మారుతి వీరభద్ర ప్రసాద్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం నగరంలోని ఎస్టీ కాలనీలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మారుతి వీరభద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో సులభంగా కలిసిపోకపోవడంతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తడంతో పాటు మానవాళికి భవిష్యత్‌లో తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, ప్రజలు జూట్, వస్త్రాలతో తయారు చేసిన సంచులను వినియోగించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో ధార్మిక సెల్ కో-కన్వీనర్ దారుకు మళ్లీ, లక్ష్మీరెడ్డి, పసుమర్తి సంతోష్, కన్వీనర్లు బండారు శ్రీనివాసరావు, సూర విష్ణు, గుర్రాల నాగేందర్, బీజేపీ త్రీటౌన్ ప్రధాన కార్యదర్శులు కొంకిమళ్ల మృత్యుంజయరావు, దోనవాన్ దాసు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంకతి పాపారావు, వైరా ప్రభారి, సీనియర్ నాయకుడు ఈదుల వీరభద్రం, జంగిలి రమణ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- దివ్యాంగుల కన్నీళ్లు తుడిచేందుకు బీజేపీ అండగా నిలుస్తుంది
- బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి



**ఖమ్మం,నేలకొండపల్లి, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** దివ్యాంగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో దివ్యాంగుల తో ఆత్మీయ సమ్మేళనం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివ్యాంగులు సమాజంలో ఎవరికి తీసిపోరని అన్నారు. వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాలలో తమ ప్రతిభను చాటుతారని అన్నారు. ఆత్మగౌరవం, స్వాలంభన కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.6 వేలు ఇస్తామని ఓట్లు వేయించుకుని ఆ తరువాత హామీని అమలుఅమలు చేయకపోవటం దారుణం అన్నారు. ప్రభుత్వం వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేకుంటే వారు చేసే ఆందోళనకు బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. దివ్యాంగుల కన్నీళ్లు ను తుడిచేందుకు బీజేపీ అవసరమైతే పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీజేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య. బీజేపీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్. అనంతు ఉపేందర్ గౌడ్, కోటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## శకుంతల మృతి పట్ల సంతాపం



**ఖమ్మం , అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరంలో గల 49వ డివిజన్ మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన కొదుమూరి కుమారస్వామి అత్త శకుంతల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఖమ్మం అర్బన్ డీసీసీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి వారి నివాసానికి వెళ్లి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏదు నూతల ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి భూమే భూ రీ-సర్వేకు ప్రామాణికం : ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ-సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి
- రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రీ-సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలి
- వైరా మండలం నారుపునేనిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం , అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** రీ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన రికార్డులను రూపొందించడం కోసం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. వైరా మండలం నారుపునేనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు, భూయజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న విధానం, ఇప్పటివరకు పూర్తయిన, మిగిలిన ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, సర్వే నిర్వహణ విధానం, భూ రికార్డుల క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి అంశాన్ని రైతుల సమక్షంలో పరిశీలించి, వాస్తవాలను మాత్రమే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలోని భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలు రికార్డులతో సరిపోలని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.రీ-సర్వేలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత విస్తీర్ణం నమోదై ఉంది, పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా, రికార్డుల్లో నమోదైన వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ విస్తీర్ణానికి మధ్య తేడా ఉంటే, చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అన్నారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని, భూ విస్తీర్ణం ఎక్కువగా లేదా తక్కువగా ఉన్నట్లయితే అందుకు గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు.సర్వే సందర్భంగా సంబంధిత భూ యజమానికి వివరాలను తెలియజేసి, నిబంధనల ప్రకారం వారి సమ్మతిని నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు, పాత పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగుకు సంబంధించిన ఇతర ఆధారాలను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. సర్వే నోటీసు అందించినట్లు రసీదు తీసుకోవడం, ఫోటోలతో కూడిన పంచనామా రూపొందించడం, ఆధార్, మొబైల్ నంబర్ తదితర అవసరమైన వివరాలను నమోదు చేయడం వంటి ప్రక్రియలను తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రీ-సర్వేలో తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల్లోని వివరాలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న తేడాలను సాంకేతికంగా పరిశీలించి, మ్యాప్‌లు, సర్వే నంబర్లు, క్షేత్రస్థాయి కొలతలను సమన్వయం చేస్తూ భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా పక్కా రికార్డులను రూపొందించాలని సూచించారు. అధునాతన రోవర్, ట్యాబ్ తదితర సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన భూ యజమానులు, సాగుదారులకు భూ హక్కులపై స్పష్టత కల్పించే విధంగా రీ-సర్వేను పారదర్శకంగా పూర్తి చేసి, అర్హులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందేలా భూ రికార్డులను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, తమ వద్ద ఉన్న సంబంధిత భూ పత్రాలను అధికారులకు అందజేస్తూ సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించే రీ-సర్వే ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలను తగ్గించి, భూ రికార్డుల్లో మరింత స్పష్టత తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల తహసీల్దార్ సురేష్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరలపై వివక్ష

- ఖమ్మంను కరువు జిల్లాగా ప్రకటించాలి
- 12న కలెక్టరేట్ వద్ద ధర్నా
- విద్యుత్ కోతలను నివారించాలి
- రైతు సంఘం సమావేశంలో బాగం హేమంతరావు




**ఖమ్మం , అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరల ప్రకటన విషయంలో దక్షిణ భారత దేశం పట్ల తీవ్ర వివక్ష ప్రకటించిందని ఇక్కడ పండే ప్రధాన పంటలకు సంబంధించి ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి పంటలకు మద్దతు ధరను ప్రకటించకపోవడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర -రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. ఎల్నినో వల్ల ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటల నష్టాన్ని అంచనా వేసి కరువు జిల్లాలుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ విద్యుత్ కోతలను నివారించాలని, కరువు జిల్లాలుగా ప్రకటించాలని, పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వరికి -ఎకరాకు రూ. 30వేలు, పత్తి, మిర్చికి రూ. 50వేలు, ఇతర పంటలకు రూ. 20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన హేమంతరావు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు దారుణంగా విధిస్తున్నారని ఒక పక్క సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే మరో పక్క భూగర్భ జలాలు ఉన్న -విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని, నాణ్యమైన విద్యుత్ను 24 గంటల పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. దారుణమైన కోతల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని హేమంతరావు తెలిపారు. రైతు బీమాను అమలు చేయడం లేదని రైతు బీమాను నిలిపివేసిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది రైతులు వివిధ కారణాలతో చనిపోయారని హేమంతరావు తెలిపారు. తక్షణం రైతు బీమా, పంటల బీమా పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే పత్తి దిగుబడి ప్రారంభమైనందున సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటా రూ.10వేల చొప్పున పత్తిని కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎరువుల యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని యాప్ను రద్దు చేసి స్వేచ్ఛగా మార్కెట్లో -ఎరువులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తులను సకాలంలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని -ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి ప్రభుత్వ తాత్సర్యం శాపంగా మారిందని సరైన సమయంలో సీతారామ ప్రాజెక్టు -పూర్తి చేసి ఉంటే ఈనాడు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఉమ్మడి జిల్లా ప్రజలకు గోదావరి జలాలతో కరువు ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రైతు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

- విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి పౌష్టికాహారం దోహదం... మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్



**మంథని, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**
ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంమంథని: మంథని మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ (బాలుర) కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించింది. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కోట ఉష, అధ్యాపక బృందం చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా భోజనానికి సంబంధించిన ఇబ్బందులు తొలగి, వారు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. పౌష్టికాహారం అందడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న ఉదయం అల్పాహార పథకం కూడా విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరిగిందన్నారు. విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంపై ప్రభుత్వం, దాతృ సంస్థలు చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థుల సంక్షేమం కోసం చేపట్టే ఇలాంటి కార్యక్రమాలకు మున్సిపల్ పాలకవర్గం ఎల్లప్పుడూ సహకరిస్తుందని వోడ్నాల శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మాచిడి రాజు గౌడ్, పెంటరి రాజు, ఎల్లెంకి వంశీధర్, నాయకులు జంబోజు సమ్మయ్య, ప్రభుత్వ జూనియర్ (బాలుర) కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై కఠిన నిఘా

- నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణ చర్యలు.. రాత్రివేళల్లోనూ తనిఖీలు
- జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశాలు





**మేడ్చల్, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లాలోని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లలో చట్టబద్ధమైన నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులు, క్లినిక్‌లు, ఇతర వైద్య సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, తనిఖీలు, చట్టపరమైన నిబంధనల అమలుపై జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధ్యక్షతన మంగళవారం జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వైద్య సంస్థల కార్యకలాపాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, తనిఖీ విధానాలు, అగ్నిమాపక భద్రతా నిరభ్యంతర ధ్రువపత్రం, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.రాత్రివేళల్లోనూ తనిఖీలుతనిఖీల సందర్భంగా అధికారులు సేకరించిన ఆధారాలు, పరిశీలించిన అంశాలు, తనిఖీ నిర్వహించిన అధికారుల వివరాలతో నివేదికలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైన సందర్భాల్లో రాత్రివేళల్లోనూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొంటున్న సంస్థల్లో వాస్తవంగా అన్ని వేళల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్పష్టం చేశారు.మందుల విక్రయంపై ప్రత్యేక దృష్టిక్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లలో ప్రిస్క్రిప్షన్ నిబంధనలు, వైద్యుల సూచనల మేరకు మందుల విక్రయం జరుగుతోందా లేదా, ఓవర్ ద కౌంటర్ మందుల విక్రయంలో నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఔషధ నియంత్రణ చట్టాలకు అనుగుణంగా మందుల విక్రయం జరగడంతో పాటు సంబంధిత రికార్డులను తప్పనిసరిగా నిర్వహించేలా చూడాలని సూచించారు.తప్పుడు ప్రకటనలకు తావులేదుప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు, అందిస్తున్న వైద్య సేవలు, తప్పనిసరిగా ప్రదర్శించాల్సిన సమాచారాన్ని ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని ఫైజాన్ అహ్మద్ సూచించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు వైద్య ప్రకటనలు, అవాస్తవ హామీలు, తప్పుదారి పట్టించే ప్రచారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు.వివిధ శాఖల నుంచి, ముఖ్యంగా పోలీస్ శాఖ ద్వారా అందిన ఫిర్యాదులపై కూడా సమావేశంలో సమీక్షించారు. తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం అవసరమైనప్పుడు 112 అత్యవసర సేవలను వినియోగించుకోవాలని సూచించారు.బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై దృష్టిక్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణహిత పద్ధతుల అమలుపై కూడా సమావేశంలో చర్చించారు. వైద్య సంస్థలు ప్రజారోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కూడా కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.జిల్లాలో అమలులో ఉన్న అన్ని చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు చేపట్టిన చర్యలపై చర్యల నివేదికలను సిద్ధం చేసి తదుపరి జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశంలో సమర్పించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆనంద్, ఏసీపీలు ఎస్. చక్రపాణి, శ్రీకృష్ణ ప్రసాద్, ఐఎంఏ ప్రతినిధి వెంకటేశ్వరరావు, డిప్యూటీ డెమో వసంతకుమారి, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన ఏసీఎంవో, ఏటీడీవో.



**ఏన్కూరు , అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :**
అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏసీఎంవో) ఎల్.రాములు, వైరా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి (ఏటీడీవో ) పి.రమేష్ మంగళవారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యా, బోధనా కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల తీరును పరిశీలించి, విద్యార్థుల పరీక్షల నిర్వహణ,మూల్యాంకన విధానాన్ని సమీక్షించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ భద్రాచలం వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉద్దీపకము–3 తీరు తెన్నులను పరిశీలించి విద్యార్థుల స్థాయిని, ప్రగతిని పరిశీలించారు.అనంతరం పాఠశాలలోని వివిధ విద్యా, పరిపాలనా రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణ తీరుపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు మరింత ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని సూచించారు.అలాగే పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యసన స్థాయిలు, పరీక్షల ఫలితాలు తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు నూతన బోధనా పద్ధతులను అనుసరించాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఏటీడీవోలు సూచించారు. మధ్యాహ్నం అందించిన మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరంఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఏటీడీవో లు అందించిన సూచనలు, సలహాలను పాటిస్తూ పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఎస్.సీ.ఆర్.పి బి.బాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు, డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరరావు ఉపాధ్యాయులు బి. శోభన్ నాయక్, బి.సక్రాం, కే.శ్యామల, పాయం శ్రీనివాస్,ఎం.చంద్రరావు, డి వెంకటరమణ, బి.వసంతదేవి,బి.రవి, బి.సింగ్య,బి.సక్రాం,ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పి సి పి ఎన్ డి టి చట్టాన్ని బలోపేతం చేద్దాం



**నిజామాబాద్,అక్టోబరు7 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని పి సి పి ఎన్ డి టి చట్టాన్ని బలోపేతం చేయడానికి సమీక్ష సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ తన ఛాంబర్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ....ఒక టీం వర్క్ గా పని చేస్తూ ఈ చట్టాన్ని,ఎంటిపీ చట్టాన్ని బలోపేతం చేయాలని అన్నారు.ప్రతి స్కానింగ్ సెంటర్ ను ఇన్స్పెక్షన్ చేయడం ఆడిట్ చేయడం జరగాలని,ముగ్గురు జిల్లా ఉప వైద్యాధికారులు,ప్రోగ్రాం అధికారి ప్రతిరోజు ఒక్కొక్కరు మూడు సెంటర్లను ఇన్స్పెక్షన్ చేయాలన్నారు.వైద్యశాఖ తో పాటు పోలీసు లీగల్ రెవెన్యూ స్వచ్ఛంద సేవా సంస్థలను స్కానింగ్ సెంటర్లో తనిఖీల్లో భాగస్వామ్యం చేయాలని అన్నారు.గర్భస్థ పూర్వక వ్యవస్థ పిండలింగ నిర్ధారణ పరీక్షలు నిషేధ చట్టంపై విస్తృతమైన అవగాహన,ప్రతి సంవత్సరం కలిగించాలన్నారు.జిల్లాలో 135 స్కానింగ్ సెంటర్లలో వారి యొక్క రిజిస్ట్రేషన్,రెన్యువల్సును అప్డేట్ చేయాలన్నారు.ప్రతి స్కానింగ్ సెంటర్ లో ప్రతి నెల 5వ తేదీలోపు రిపోర్టులను ఇవ్వాలని,ప్రతి నెల ఆడిట్ చేయాలని,అర్హత లేని వైద్యుల ద్వారా స్కానింగ్ కోసం రిఫర్ చేయ రాదన్నారు.జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఈనెల 24,31 తేదీలలో ప్రభుత్వ వైద్యులకు లీగల్ అంశాలపై అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు.పి సి పి ఎన్ డి టి ఆక్ట్ పై కరపత్రాలను,పోస్టర్లను ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు.ఈ నెల13న బోధన్ డివిజన్లోని వైద్యులందరికీ పి సి పి ఎన్ డి పి ఆక్ట్ పై అవగాహన నిర్వహించడం జరుగుతుందన్నారు.టీమ్ మెంబర్స్ అందరూ పి సి పి ఎన్ డి టి ఆక్ట్ పై అవగాహన కలిగి ఉండాలని ప్రతి స్కానింగ్ సెంటర్లో రికార్డులను ఐదు సంవత్సరాల వరకు ఉంచాలని కనీసం రెండు సంవత్సరాల వరకు భద్రపరచాలన్నారు.ప్రతి ఆసుపత్రి నుండి డెలివరీలు,వ్యాధులు ఒక టీకాలు,సి సెక్షన్,నోటిఫై ఏబుల్ వ్యాధులపై సమాచారాన్ని ప్రతినెల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపించాలన్నారు.జిల్లాలో స్త్రీ పురుష నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో ముఖ్యంగా భీంగల్,డొంకేశ్వర్,ఇందల్వాయి,కమ్మర్పల్లి,పెగడపల్లి,పోతంగల్ లాంటి మండలాల్లో విస్తృతంగా పిసిపి ఎన్డిటి ఆక్ట్ పై అవగాహన కలిగించడం జరుగుతుందని తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ విద్య,డాక్టర్ రవీందర్,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుప్రియ,డాక్టర్ శిఖర,డాక్టర్ నవ్య,డాక్టర్ వెంకన్న,డాక్టర్ అజ్మల్,డాక్టర్ కీర్తన,హెచ్ఈఈఓ జాహిద్ హఫీజ్,ఎస్ఓ రాజేశ్వర్,డిహెచ్ఈ లు వేణుగోపాల్,వెంకటేశ్వర్లు,హెచ్ఇఓలు సురేష్ కుమార్,గోవర్ధన్,సాయి,సిహెచ్ఓ నాగరాజు లు పాల్గొన్నారు.

# చికిత్స కోసం రూ. 2 లక్షల ఎల్ఓసి అందజేత

- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, అక్టోబరు7(జర్నలిస్ట్ ఫైల్) :**
మంథని మండలంలోని ఖాన్సాయి పేట గ్రామానికి చెందిన కుంటాల వెంకటయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 2,00,000 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది. చికిత్స కోసం 2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకు వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి




**మహేశ్వరం, అక్టోబరు 07 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా SIR ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఏఐసీసీ మరియు ఇండియా కూటమి పిలుపు మేరకు, అలాగే టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరియు అఖిల పక్షం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్,కొంగర కలాన్ నిర్వహించిన భారీ నిరసన మార్చ్ లో పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం...ఓటర్ల హక్కుల కోసం...ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే లు, నియోజకవర్గ ఇంచార్జీలు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, సేవాదళ్ మరియు అనుబంధ విభాగాల నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 25 ఏళ్ల ప్రజా సేవా శిఖరానికి నమో



- ఆధునిక ఉక్కు మనిషి ప్రధాని మోదీ వజ్రసంకల్పం నెరవేరాలి
- వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు

**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** దేశ శ్రేయస్సు–ప్రజాసంక్షేమమే లక్ష్యంగా 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న ఆధునిక ఉక్కుమనిషి ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ప్రధాని వికసిత్ భారత్ వజ్రసంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ అమరావతిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకున్నారు. 2001 అక్టోబరు 7వ తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన మోదీ ప్రస్థానం నేటితో 25 ఏళ్లు (రజతోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీద వెంకటపాలెం ఆలయంలో లోకేష్ పూజలు చేశారు. ప్రపంచంలోనే మన దేశం అన్నిరంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో నిస్వార్థంగా పనిచేస్తున్న ఆధునిక ఉక్కుమనిషి నరేంద్ర మోదీ గారికి ఆ శక్తియుక్తులన్నీ దేవుడు ప్రసాదించాలని లోకేష్ ప్రార్థించారు.

మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ యాత్రగా నిర్వహించడం దేశాభివృద్ధి కోసం ప్రధాని చేస్తున్న కృషికి నిదర్శనం అని లోకేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో కాపీయింగ్...

# మంత్రి సత్యకుమార్ సీరియస్



- విచారణ జరిపి వారంలోగా నివేదిక అందజేయాలని కార్యదర్శికి ఆదేశాలు

**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల పరీక్షల్లో చోటుచేసుకున్న కాపీయింగ్ ఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. గత ఆగస్టులోనే కాపీయింగ్ జరిగినట్లు వెలుగులోకి వచ్చినప్పటికీ కళాశాల, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ స్థాయిలో తీసుకున్న చర్యలు ఏమిటన్న దానిపై మంత్రి ఆరా తీశారు. తొలి ఘటనపై సకాలంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకున్నారా లేదా అన్నది పరిశీలించాలని సూచించారు. ఈ వ్యవహారంలో జరిగిన లోపాలను గుర్తించి, వారం రోజుల్లో సమగ్ర విచారణ నివేదిక సమర్పించాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శిని మంత్రి ఆదేశించారు. కాపీయింగ్ ఘటనకు దారితీసిన విధానంపై సమగ్రంగా విచారణ జరపాలని మంత్రి సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడ లోపం జరిగింది, ఘటన ఎలా చోటుచేసుకుంది, కాపీయింగ్‌కు అనుసరించిన విధానం ఏమిటి వంటి అంశాలను పూర్తిగా పరిశీలించాలని పేర్కొన్నారు. అలాగే తొలి ఘటన విషయంలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ అధికారులు స్పందించిన తీరులో ఏమైనా లోపాలు జరిగాయా అన్నది కూడా పరిశీలించాలని ఆదేశించారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, బాధ్యుల పాత్ర గురించి నివేదికలో పొందుపరచాలని మంత్రి పేర్కొన్నారు.

## మనమిత్ర ద్వారా కుల ధృవీకరణ పత్రాలు

- మొబైల్ ఫోన్ ద్వారానే డౌన్లోడు చేసుకునే సదుపాయం
- రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్వీసు అందుబాటులో ఉందన్న ఆర్టీజీఎస్

**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలను తమకు కావాల్సినప్పుడు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా తాము‌న్న చోటు నుంచే తమ మొబైల్‌ఫోన్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చని ఆర్టీజీఎస్ తెలిపింది. మనమిత్రలోని రెవెన్యూ సేవల విభాగంలో పౌరులు రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ విభాగాన్ని ఎంపిక చేసుకుని అందులో తమ ఆధార్ నంబరు పొందుపరిచి ఓటీపీ పొందాలి. ఈ ఓటీపి అందులో నమోదు చేసిన తర్వాత కొన్ని వివరాలను నింపాలి. తర్వాత కుల ధృవీకరణ పత్రం పొందడానికి కావాల్సిన రూ. 40ల రుసుమును వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే చెల్లించవచ్చు. ఒకసారి చెల్లింపు అయిన తర్వాతు వాట్సాప్‌లో మీ కుల ధృవీకరణ పత్రం డౌన్లోడు చేసుకోవచ్చు. ఇప్పటికే కుల ధృవీకరణ పత్రాలు జారీ అయిన వారు తమ కుల ధృవీకరణ పత్రాలను వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన సమయంలో కావాల్సిన చోట డౌన్లోడు చేసుకోవచ్చు. ప్రతి సారీ కుల ధృవీకరణ పత్రం కోసం రెవెన్యూ కార్యాలయాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఈ సదుపాయం ఇప్పటిక కుల ధృవీకరణ పత్రాలు పొందినవారికి కల్పిస్తున్నామని త్వరలో మనమిత్ర ద్వారా కొత్తగా కుల ధృవీకరణకు దరఖాస్తు చేసుకుని పొందే సదుపాయం కూడా కల్పించనున్నట్లు ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు.

**ఇలా ఉపయోగించాలి**

1: మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 కు హాయ్ అని మెసేజ్ పంపాలి
2: సేవను ఎంచుకోండి అనే అప్షన్ ఎంపిక చేసుకోవాలి
3: రెవెన్యూ సేవల ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి
4: రీ–ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి
5: మీ ఆధార్ నంబరు టైపు చేయాలి
6: మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఓటీవీ అడిగిన చోట టైపు చేయాలి
7: ఆధార్ డెమోగ్రాఫిక్స్ రివ్యూలో అడిగిన వివరాలు పొందుపరచాలి
8: కుల ధృవీకరణ పత్రం పొందడానికి రూ. 40 రుసుం చెల్లించాలి
9: ఈ డబ్బు చెల్లించడానికి ఉన్న పేమెంట్ గేట్ వే ద్వారా చెల్లించాలి
10: మీ కుల ధృవీకరణ పత్రం పీడీఎఫ్ డౌన్లోడు వస్తుంది
11: దాన్ని మీరు ప్రింట్ లేదా డౌన్లోడు చేసుకోవచ్చు.

# బాల కార్మికులు కనిపిస్తే చర్యలే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- గోడౌన్లలో పిల్లలతో పని చేయిస్తే సహించం
- బాల కార్మికులు, శానిటేషన్ సమస్యలపై ఎమ్మెల్యే సీరియస్
- మిర్చి గోడౌన్ల యజమానులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరిక



**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని కామాక్షి నగర్ మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లో బాల కార్మికులను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. మిర్చి గోడౌన్లు, పాకల్లో బాల కార్మికులు కనిపిస్తే గోడౌన్ యజమానులు, మేస్త్రీలు, తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 25వ డివిజన్ కామాక్షి నగర్‌లో బుధవారం మిర్చి తొడిమల గోడౌన్లలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలు, మేస్త్రీలు, గోడౌన్ యజమానులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులను పనులకు వినియోగించడం శిక్షార్హమైన నేరమని అన్నారు. పిల్లలను పనులకు తీసుకురావడాన్ని గోడౌన్ యజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారిని చదువుల వైపు మళ్లించాలని కోరారు. చిన్న వయసులోనే పనులకు అలవాటు చేయడం వల్ల వారు విద్యకు దూరమై భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని చెప్పారు.

**ఒక ఏడాది పాటు ప్రత్యేక పర్యవేక్షణ**

కామాక్షి నగర్ మిర్చియార్డు ప్రాంతంలో వచ్చే ఏడాది పాటు చైల్డ్ లేబర్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలను పనులకు పంపించే తల్లిదండ్రులు, అవకాశం కల్పించే గోడౌన్ యజమానులు, మేస్త్రీలపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అంశంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**సీజనల్ హాస్టళ్లను సమర్థంగా నిర్వహించాలి**

ఒడిశా నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలు చదువులకు దూరం కాకుండా సీజనల్ హాస్టళ్లు, విద్యా సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, అర్హులైన పిల్లలందరికీ వసతి, విద్యా అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**శానిటేషన్‌పై రాజీ లేదు**

మిర్చి తొడిమల వ్యర్థాలను గోడౌన్ ప్రాంగణాల వెలుపల పడేయడం వల్ల శానిటేషన్ సమస్యలు తీవ్రమవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తొడిమలు, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా తగిన విధంగా నిర్వహించాలని సూచించారు. వ్యర్థాలను కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శానిటేషన్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

**కార్మికులకు మరుగుదొడ్లు తప్పనిసరి**

గోడౌన్లలో పనిచేసే కార్మికులకు, ముఖ్యంగా మహిళలకు తగిన మరుగుదొడ్ల సదుపాయం కల్పించాల్సిన బాధ్యత యజమానులదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్మికుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి గోడౌన్‌లో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల నుంచి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని కోరారు.

అనంతరం మీడియాతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ చైల్డ్ లేబర్, విద్య, శానిటేషన్, లా అండ్ ఆర్డర్ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు, గోడౌన్ యజమానులు, కార్మికులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

గోడౌన్ యజమానులు, మేస్త్రీల వివరాలను సేకరించామని, ఇకపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి మొహమాటం ఉండదన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# జగనంత దైవం - జగమంత కుటుంబం - నా సొంతం





- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** వాడవాడలా వేడుకలు నిర్వహించడం ద్వారా తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్ ఆధ్వర్యంలో లేళ్ళ అప్పిరెడ్డి ఆరోగ్యాన్ని, మరింత ఉన్నతిని కాంక్షిస్తూ క్రైస్తవ మత పెద్దలు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏటీ అగ్రహారానికి చెందిన పులి శ్రీనివాసరెడ్డి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని ఘనంగా చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, జగనంత దైవం – జగమంత కుటుంబం కలిగిన తాను ఎంతో అదృష్టవంతుడినని అభిప్రాయపడ్డారు. తనకు తోడబుట్టిన వారు కాకపోయినా.. విశేషమైన ఆదరాభిమానాలు చూపిస్తున్న వారంతా తన సొంత కుటుంబ సభ్యులేనని ఆయన స్పష్టం చేశారు. అలాగని ఇలా ఏదో రెండు మాటలు చెప్పినంత మాత్రాన ఈ రుణం తీరదన్న వాస్తవం తనకు తెలుసని ఆయన అన్నారు. అందుకే వారికి అన్ని విషయాలలో అండగా నిలుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఈ బంధం మరింత బలపడి జన్మజన్మల అనుబంధంగా మారుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, బోడపాటి కిషోర్, కాకి శ్రీనివాసరావు, కేసరి సుబ్బులు, ఆలా కిరణ్, పరిశపోగు భరత్, బాలిరెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లా పోలీసులకు ప్రత్యేక లోగో ఆవిష్కరణ

- జిల్లా పోలీసు అధికారులతో కలిసి లోగోను ఆవిష్కరించిన ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీసు శాఖకు ప్రత్యేకంగా రూపొందించిన జిల్లా పోలీసు లోగోను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని ఆరు పోలీసు సబ్‌డివిజన్ల డీఎస్పీలు, మహిళా పోలీసు డీఎస్పీ, సీసీఎస్ డీఎస్పీతో కలిసి ఎస్పీ లోగోను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా పోలీసు శాఖకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రత్యేక లోగోను రూపొందించినట్లు తెలిపారు. ఇకపై జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో భాగంగా ఈ లోగోను ధరించాలని సూచించారు. పోలీసు శాఖకు సంబంధించిన కార్యక్రమాలు, అధికారిక వ్యవహారాల్లోనూ జిల్లా పోలీసు లోగోకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసు శాఖకు ప్రత్యేకమైన లోగో ఉండటం ద్వారా అధికారులు, సిబ్బందిలో శాఖ పట్ల మరింత బాధ్యత, ప్రత్యేక గుర్తింపు భావన పెంపొందుతుందని ఎస్పీ పేర్కొన్నారు. అదే విధంగా ప్రజల్లో గుంటూరు జిల్లా పోలీసు వ్యవస్థపై అవగాహన, నమ్మకం మరింత పెరగడానికి ఈ లోగో దోహదపడుతుందని తెలిపారు. పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, సేవల విషయంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గుంటూరు జిల్లాకు ప్రత్యేకంగా పోలీసు లోగోను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఎస్పీతో పాటు డీఎస్పీలు పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు పోలీసు అధికారులు, సిబ్బందిలో సమష్టి బాధ్యతను పెంపొందించేందుకు ఈ లోగో ఒక ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సంస్కరణలను క్షేత్రస్థాయిలో విజయవంతం

- హక్కులతో పాటు బాధ్యతతో ప్రజలకు మెరుగైన సేవలు
- ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం



**విజయవాడ, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యతతో పనిచేస్తామని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గం తెలిపింది. రెవెన్యూ శాఖలో ప్రభుత్వం చేపడుతున్న నూతన సంస్కరణలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేసి, ప్రజలకు చేరువ చేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం. బాపూజీ పేర్కొన్నారు.

ఈ నెల 2న విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీ వీఆర్వోల సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, కోశాధికారి ఆర్.ఎన్. దివాకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో రెవెన్యూ పరిపాలనలో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి ఉద్యోగులు, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని సంఘం నాయకులు తెలిపారు.

నూతన రాష్ట్ర కార్యవర్గానికి మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందనలు తెలిపారు. ఉద్యోగుల హక్కులు ఎంత ముఖ్యమో, ప్రజల పట్ల వారి బాధ్యతలు కూడా అంతే కీలకమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వోలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు వేగవంతమైన, మెరుగైన సేవలు అందుతాయని అన్నారు.

"హక్కులతో పాటు బాధ్యత కూడా మా కర్తవ్యం. ప్రజాసేవే మా లక్ష్యం. పారదర్శకత, నిబద్ధత, జవాబుదారీతనంతో విధులు నిర్వహిస్తూ రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తాం" అని వీఆర్వోల సంఘం నాయకులు తెలిపారు.

కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి వి. కోటేశ్వరరావు, కోశాధికారి వై.పి. రంగయ్య, ఉపాధ్యక్షులు బి. శ్రీనివాసరావు, కె.వి.వి. సత్యనారాయణ, సి. నాగేంద్ర, జాయింట్ సెక్రటరీలు జి. పేతురు, కె. కోటి బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. సాహితి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్యశాఖ పారామెడికల్ సిబ్బంది సమ్మెకు సీఐటీయూ మద్దతు

**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** వైద్య, ఆరోగ్యశాఖలోని డైరెక్ట్ కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెకు సీఐటీయూ ఏపీ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రెగ్యులరైజేషన్, గ్రాస్ శాలరీ చెల్లింపు తదితర డిమాండ్లపై రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నారని సీఐటీయూ ఏపీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏ.వి.నాగేశ్వరరావు తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్ట్ సిబ్బందికి సమాన వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో వేలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, కోవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని తెలిపారు. 50 ఏళ్లు దాటిన శానిటేషన్ సిబ్బందిని తొలగించడం నిలిపివేయాలని, అర్హులైన కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి సమాన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి, పేద ప్రజలకు వైద్య సేవలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## 9న ఎపి సచివాలయంలో 2027 జనాభా లెక్కల సేకరణపై రాష్ట్ర స్థాయి సమావేశం

**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** జనాభా లెక్కల సేకరణ 2027లో భాగంగా రెండవ విడత పాపులేషన్ ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి ఈనెల 9వ తేది శుక్రవారం ఉ. 10.30గం.ల నుండి సా. 5గం.ల వరకూ రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో ఒక రోజు రాష్ట్ర స్థాయి సమావేశం జరగనుందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(జిపిఎం అండ్ ఎఆర్) ఎస్.ఎస్. రావత్ తెలియజేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వారి అధ్యక్షతన జరిగే ఈ ఒకరోజు రాష్ట్ర స్థాయి సమావేశంలో రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ సహా ఇతర అధికారులు, రాష్ట్ర స్థాయి సెన్సస్ కోఆర్డినేషన్ కమిటీకి సంబంధించి ఆయా శాఖల కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులైన జిల్లా కలక్టర్లు వారితోపాటు జెసి లేదా డిఆర్ఓ స్థాయి అధికారి, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులైన మున్సిపల్ కార్పోరేషన్ల మున్సిపల్ కమీషనర్లు వారితో పాటు అదనపు కమీషనర్ లేదా డిప్యూటీ కమీషనర్ సెన్సస్ డైరెక్టరేట్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఈసమావేశంలో రెండవ విడత పాపులేషన్ ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి సన్నాహక చర్యలు ఇతర అంశాలపై చర్చించడం జరుగుతుందని స్పెషల్ సిఎస్ రావత్ తెలియజేశారు.

## ఘనంగా బైక్ ర్యాలీ, కాగడాల ప్రదర్శన



- ప్రధాని మోడీ 25 ఏళ్ల ప్రజాసేవ వేడుకలలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వినుకొండ పట్టణంలో వేడుకలలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్ఎస్పీ స్థలం నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ కాల్వకట్ట, బస్టాండ్, శివయ్య స్తూపం సెంటర్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం ఎంపీడీవో ఆఫీస్ వద్ద కాగడాల ప్రదర్శన చేపట్టి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జీవీ మాట్లాడుతూ... ప్రధాని మోడీ గారి నిరంతర ప్రజాసేవ, సమర్థవంతమైన పరిపాలన దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకి తీసుకెళ్తున్నాయని కొనియాడారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబరుకు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సేవాజ్యోతి యాత్ర



- ప్రధాని మోదీ ప్రజాసేవకు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవాజ్యోతి యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద నుండి బైక్ ర్యాలీ ప్రారంభం

**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'సేవాజ్యోతి యాత్ర' బైక్ ర్యాలీని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే & టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి బుధవారం ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను గుర్తు చేస్తూ చేపట్టిన కార్యక్రమం తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీని శ్రీనివాసరావుపేటలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి సేవాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం యువతతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల గుండా లక్ష్మీపురంలోని మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేశాభివృద్ధి, సుపరిపాలన, సేవా తత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, దేశాన్ని అభివృద్ధి చెందిన భారతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, ఎన్డీయే కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వైద్యారోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం రెగ్యులరైజ్ చేయాలి

- 100 శాతం గ్రాస్ శాలరీతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ చెల్లించాలి
- వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి



**తాడేపల్లి, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం రెగ్యులరైజ్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ పూర్తయ్యే వరకు జీవో ఆర్టీ నెం. 459 ప్రకారం 100 శాతం గ్రాస్ శాలరీతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ చెల్లించాలని కోరారు. సుమారు 14,600 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, రేడియోగ్రాఫర్లు, ఈసీజీ, అనస్తీషియా టెక్నీషియన్లకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, అర్హత ఉన్న ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 10,117 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కేబినెట్ నిర్ణయం తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు.

ఉద్యోగులకు మంచి పీఆర్సీ, ఐఆర్, డీఏలతో పాటు పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, ఉపాధ్యాయులు తదితరుల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అధికారులకు రీ–అపాయింట్‌మెంట్లు ఇవ్వడం నిలిపివేసి కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# వివిఐటియులో ముగిసిన 'బ్రిగేడ్- వివిఐటియు ఐడియాథాన్'




**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వివిఐటియు)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, అనుబంధ విభాగాల విద్యార్థుల కోసం నిర్వహించిన నాలుగు రోజుల 'బ్రిగేడ్––వివిఐటియు ఐడియాథాన్' విజయవంతంగా ముగిసింది. 'బిల్డ్ ఏఐ ఏజెంట్స్ ఫర్ ది రియల్ వరల్డ్' ప్రధాన అంశంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఏజెంటిక్ ఏఐ సాంకేతికతలపై అవగాహన కల్పించినట్లు వివిఐటియు ప్రో–ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.

స్పినాబోట్ సంస్థకు చెందిన సాంకేతిక నిపుణుడు భాస్వంత్ దేవ్ ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు ఏఐ సాంకేతికతలపై శిక్షణ అందించారు. ఐడియాథాన్‌లో భాగంగా విద్యార్థులు సామాజిక, సాంకేతిక సమస్యలకు ఏఐ ఏజెంట్ ఆధారిత పరిష్కారాలను రూపొందించి ప్రదర్శించారు. విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిఐటియు రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి. రామచంద్రన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువత అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా మోదీ పాలన






- బీజేపీ జాతీయ నేత, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్
- మోదీ 25 ఏళ్ల ప్రజా సేవకు గుర్తుగా సేవా జ్యోతి యాత్ర

**విజయవాడ, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా విజయవాడలో 'సేవా జ్యోతి యాత్ర' పేరుతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేబీఎన్ కళాశాల నుంచి భవానీపురంలోని ఎమ్మెల్యే వై. సుజనా చౌదరి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. మంత్రి వై. సత్యకుమార్, ఎమ్మెల్యే వై. సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డురి శ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 2001 అక్టోబర్ 7న మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, అనంతరం సుమారు 12.5 ఏళ్లపాటు సీఎంగా, మరో 12.5 ఏళ్లుగా ప్రధానమంత్రిగా దేశానికి సేవలందిస్తున్నారని తెలిపారు. గుజరాత్‌లో అమలు చేసిన సుపరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా విస్తరించారని పేర్కొన్నారు.

పేదలు, రైతులు, మహిళలు, అసంఘటిత రంగ కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం కిసాన్, ఉచిత రేషన్, జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రయోజనాలు అందుతున్నాయని సత్యకుమార్ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాదంపై కఠిన చర్యలు వంటి నిర్ణయాలతో జాతీయ భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాల విస్తరణతో పాటు మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలతో దేశాభివృద్ధికి ఊతమిచ్చారని పేర్కొన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణమే మోదీ లక్ష్యమని సత్యకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధికి మద్దతు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, పాతూరి నాగభూషణం, షేక్ బాజీ, నార్నే తాతాజీ, సయ్యద్ భాషా తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మోదీ అభిమానులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఏపీకి చెందిన ఆసియా క్రీడల విజేతలు

- ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి నిలిపారంటూ ముఖ్యమంత్రి అభినందనలు



**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** 2026 ఆసియా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆసియా క్రీడల విజేతలు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సాధించిన పతకాలు, వారి అత్యుత్తమ ప్రదర్శనను సీఎం కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై మాతృభూమి పేరును నిలబెట్టిన క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయంగా రాణించాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబును కలిసిన వారిలో క్రీడాకారులు శ్రీ చరణి, గణేష్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. మొత్తంగా 3 రకాల క్రీడాంశాల్లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో సహా మొత్తం 8 పతకాలను మన రాష్ట్ర క్రీడాకారులు కైవసం చేసుకున్నారని సీఎం చంద్రబాబుకు శాప్ ఎండీ భరణి వివరించారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రభుత్వం తరఫున పూర్తి ప్రోత్సాహం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# బీజేవైఎం ఆధ్వర్యంలో సేవా జ్యోతి యాత్ర

- వికసిత్ భారత్ నిర్మాణమే మనందరి లక్ష్యం
- బీజేపీ రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు



**గుంటూరు, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయితీ ప్రదీప్ ఆధ్వర్యంలో సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు యాత్రను ప్రారంభించారు. అరండల్‌పేట యోగి భవన్‌లో ప్రధాని ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించిన అనంతరం కార్యకర్తలు వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. యోగి భవన్ నుంచి లైబ్రరీ మీదుగా లాడ్జి సెంటర్‌లోని వాజ్‌పేయి సర్కిల్ వరకు యాత్ర కొనసాగింది.

ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మోదీ ప్రజాసేవను జీవిత ధ్యేయంగా కొనసాగిస్తున్నారని అన్నారు. 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం దేశ ప్రజల విశ్వాసం, ఆశీర్వాదాలతో సాగిన సామూహిక ప్రయాణమని పేర్కొన్నారు. దేశ సంస్కృతి, పేదలు, యువత, మహిళలు, రైతులు, కార్మికుల సంక్షేమం కోసం ప్రతి కార్యకర్త సేవా భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సేవా జ్యోతి కార్యక్రమం ప్రతి కార్యకర్తలో దేశభక్తి, సామాజిక బాధ్యతను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలని అన్నారు. ప్రపంచ అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలిపేందుకు సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ పాలనలో వికసిత్ భారత్ దిశగా దేశ ప్రస్థానం



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- మోదీ ప్రజాసేవకు 25 ఏళ్లు.. విశాఖలో బీజేపీ సేవా జ్యోతి ర్యాలీ

**విశాఖపట్నం, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో సేవా జ్యోతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 25 ఏళ్లుగా ప్రజాసేవలో కొనసాగుతున్నారని తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు, గౌరవాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కావడం ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరినట్లేనని మాధవ్ అన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుతో విశాఖతో పాటు ఉత్తరాంధ్ర, రాష్ట్రంలోని రైల్వే మౌలిక వసతులు మరింత అభివృద్ధి చెందడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

రైల్వే జోన్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయంతో పాటు క్వార్టర్స్, రైల్వే క్లబ్ తదితర నిర్మాణాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని మాధవ్ వెల్లడించారు. విశాఖను కేంద్రంగా చేసుకుని రైల్వే రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతాయని ఆయన అన్నారు.

# దేశానికి సరైన సమయంలో సరైన నాయకత్వం మోదీది



**అమరావతి, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆంధ్రప్రదేశ్ మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్ అభినందనలు తెలిపారు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకత్వాన్ని అందిస్తున్న మోదీ, భారత అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారని అన్నారు. మోదీ విజన్‌తో భారత్ వికసిత్ భారత్ ఏ 2047 లక్ష్యం వైపు వేగంగా అడుగులు వేస్తోందని దిలీప్ పేర్కొన్నారు. సుదీర్ఘ ప్రజా సేవా ప్రస్థానంలో మోదీతో కలిసి పనిచేయడం తనకు గర్వకారణమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ఊపు వచ్చిందన్నారు.

మోదీ నాయకత్వంలో బలమైన భారత్‌తో పాటు సుసంపన్నమైన స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నామని దిలీప్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారంతో రాష్ట్రంలో కొత్త అవకాశాలు, మౌలిక వసతులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రధానిగా మోదీ మరిన్ని విజయాలు సాధించి దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు.

# మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానానికి ఏపీ కేబినెట్ అభినందనలు

**అమరావతి, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేక అభినందన తీర్మానం చేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి అందించిన నాయకత్వం, దేశసేవలో చూపిన నిబద్ధత, క్రమశిక్షణను కేబినెట్ ప్రశంసించింది. దూరదృష్టి, స్పష్టమైన లక్ష్యంతో భారత్‌కు కొత్త దిశ చూపారని పేర్కొంది. మౌలిక వసతులు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు సాంకేతిక ఆధారిత పాలన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇచ్చారని మంత్రివర్గం తెలిపింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను అభివృద్ధిలో భాగస్వాములుగా మార్చారని, ప్రపంచ అనిశ్చిత పరిస్థితుల్లోనూ దేశానికి స్థిరమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించింది. ప్రపంచ వేదికపై భారత్ ప్రతిష్ఠ, విశ్వసనీయతను పెంచడంలో మోదీ కృషి కీలకమని కేబినెట్ పేర్కొంది. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్వయం సమృద్ధి భారత్ నిర్మాణానికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశసేవలో ప్రధాని మోదీ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందన తీర్మానాన్ని కేబినెట్ ఆమోదించింది.

# తెలుగు సాహిత్యం విలువ వెలకట్టలేనిది

- ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి
- ఏపీ ఎస్ఆర్ఎంలో ఘనంగా ప్రారంభమైన అమరావతి సాహిత్య ఉత్సవాలు
- హాజరైన కవులు, రచయితలు, వివిధ యూనివర్సిటీల విద్యార్థులు, సాహిత్యాభిలాషులు



**అమరావతి, అక్టోబరు 7 (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు భాష, సాహిత్యం విలువ వెలకట్టలేనిదని, మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దే శక్తి తెలుగు సాహిత్యానికి ఉందని ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు అవసరమైన ప్రణాళికలతో సంస్కృతి కమిషన్ ముందుకు సాగుతోందని తెలిపారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం అమరావతి సాహిత్య ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి తేజస్వి పొడపాటి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, సాహిత్యాభిలాషులు, వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన కవులు, రచయితలను ఉద్దేశించి ప్రసంగించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ సాహిత్య ఉత్సవాల వీడియోను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో నేటితరం విద్యార్థులు 'అక్షరం' విలువను విస్మరిస్తున్నారని అన్నారు. సాహిత్య మాధుర్యాన్ని ఆస్వాదించాలంటే అక్షరాన్ని ఆరాధించాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశీ భాషలపై ఆసక్తి పెంచుకుంటున్న క్రమంలో తెలుగు విద్యార్థులు మాతృభాషను విస్మరించకూడదని హితవు పలికారు.

తెలుగు భాష, సాహిత్య విలువలను జాతీయ స్థాయిలో మరింత పెంపొందించే దిశగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. తెలుగు భాషా వికాసం, సాహిత్య విలువలను పెంచే దిశగా ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా విజయవాడలో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు పది మందికి పైగా ముఖ్యమంత్రులు హాజరుకానున్నారని వెల్లడించారు.

**పుస్తక పఠనంతో ఆత్మవిశ్వాసం..**

విశిష్ట అతిథిగా హాజరైన గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు సంభాషణా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. అమరావతి గొప్పదనాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సాహిత్య ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.

**కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యం...**

యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల భాషలు, సాహిత్యాలను పరిమళింపజేస్తున్న కవులు, రచయితలను ఒకే వేదికపైకి తీసుకురావడమే అమరావతి సాహిత్య ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వచ్చే ఏడాది నిర్వహించే సాహిత్య ఉత్సవాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రెండు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. పురస్కారాల ఎంపిక ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రత్యేక జ్యూరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన తమిళనాడుకు చెందిన ప్రముఖ రచయిత్రి మినీ కృష్ణన్ సాహిత్య ఉత్సవాల ప్రాధాన్యత, సాహిత్యం సమాజంపై చూపే ప్రభావం గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ విష్ణుపథ్, సాహిత్య ఉత్సవాల కన్వీనర్లు డాక్టర్ ఆర్గాబసు, డాక్టర్ శయంతన్ ఠాగూర్ తదితరులు ప్రసంగించారు.

ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తేజస్వి పొడపాటి, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మలను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

**తరలివచ్చిన కవులు, రచయితలు...**

మూడు రోజుల పాటు నిర్వహించే అమరావతి సాహిత్య ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి 50 మందికి పైగా కవులు, రచయితలు, సాహిత్యాభిలాషులు తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు సాహిత్యాభిమానులను ఆకట్టుకున్నాయి. వివిధ భాషల్లోని పుస్తకాలను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించి, వాటి గురించి రచయితలు, సాహితీవేత్తలతో చర్చించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com